


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 140 | మంగళవారం 26 - 05 -2026 | పేజీలు : 12 | No: KNL/3-77(D)/2026-2028 | వెల-3


## పంత్, రహానే, గైక్వాడ్.. కెప్టెన్సీ వదిలేయాల్సిన ముగ్గురు ఆటగాళ్లు వీరే?



## కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు తిప్పి కొట్టిన అభిజిత్ దీప్కే



న్యూఢిల్లీ,మే25 కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు.

# రతన్ టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం



- వంద యూనికార్న్ సంస్థల ఏర్పాటు లక్ష్యం
- విలేజ్ టూ గ్లోబల్ మా ప్రభుత్వ నినాదం
- దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలలే ఊతం
- విజయవాడ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ లో చంద్రబాబు

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ అని.. దీనిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమని ఉద్ఘాటించారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు.. మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుందని వివరించారు. సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థ, ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ తయారు కావాలని ఆకాంక్షించారు. సోమవారం విజయవాడలో ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్

## పదవుల కోసం వారు అక్కర్లేదు

పార్టీ కోసం, ఏపి అభివృద్ధి కోసం పనిచేయండి ఎదుటి వారి విమర్శలను సహించడానికి లేము అవసరమైతే వేటు తీస్తాం: పవన్ హెచ్చరిక



## పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో




న్యూఢిల్లీ,మే25 అమెరికా- ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరమూ లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్

# వాత తప్పదా..?

## మరో రూ.20 పెరగనున్న లీటర్ పెట్రోల్?

- ఇప్పటి వరకు రూ.7.38 పెరిగిన పెట్రో ధరలు
- పెంపు ఇంతటితో ఆగదని నిపుణుల అంచనా
- పశ్చిమాసియా యుద్ధంతో కంపెనీలకు భారీ నష్టాలు
- అవే తీరే వరకు పెంపు తప్పదని అంచనా






ఇంధన ధరలు ఇప్పటికే నాలుగు సార్లు పెరిగాయి. లీటరుపై దాదాపు రూ. 7.38 వరకు భారం పడింది. ఈ పెంపు ఇంతటితో ఆగదని సమాచారం. చమురు సంస్థల నష్టాల నేపథ్యంలో ధరలు మరింత పెంచక తప్పదని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

## అభివృద్ధిని తట్టుకోలేక జగన్ అక్కసు

రాష్ట్రానికి హనీమూన్ నాయకుడు జగన్ తీరుపై మండిపడ్డ మండిపల్లి



## నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు



దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై రూ. 2.71 పెంచినట్లు వెల్లడించాయి.

## ఢిల్లీలో 'పద్మ' పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము...

- రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా పద్మ పురస్కారాల ప్రదానోత్సవం
- దివంగత నటుడు ధర్మేంద్రకు మరణానంతరం పద్మ విభూషణ్
- వ్యాపారవేత్త ఉదయ్ కోటక్‌కు పద్మ భూషణ్ పురస్కారం
- క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్, నటుడు ప్రసేన్జిత్ చటర్జీలకు పద్మ శ్రీ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా సమక్షంలో అవార్డుల ప్రదానం



దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం 2026 సోమవారం నాడు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## రైతులకు తీపి కబురు చెప్పిన తమిళనాడు సీఎం విజయ్



- తమిళనాడులో రైతులకు పంట రుణాల మాఫీ పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వం
- సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు ఈ పథకం వర్తింపు
- సన్నకారు రైతులకు రూ.50,000 వరకు పూర్తి రుణమాఫీ

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేష్...



- ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి నారా లోకేష్
- విమానాశ్రయంలో స్వాగతం పలికిన టీడీపీ ఎంపీలు
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పుస్తకావిష్కరణకు హాజరు
- పధాని మోదీపై అనుభవాలతో రాసిన పుస్తకం
- రేపు ఉదయం 11 గంటలకు జరగనున్న కార్యక్రమం

ఏపీ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. సోమవారం నాడు ఢిల్లీకి చేరుకున్న ఆయనకు తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు లోకేష్ ఢిల్లీకి వెళ్లారు.

## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్ధాలు

ఎన్సాన్‌పల్లి ఐకెపి సెంటర్ సందర్శించిన హరీష్ రావు



ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. యూరియా, సాగునీరు, కరెంట్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం

## నారా లోకేష్ ను పదవి నుంచి తొలగించండి

- ప్రభుత్వం నిర్వహించింది మెగా డీఎస్సీనా లేక మోసం చేసిన డీఎస్సీనా అని జగన్ ప్రశ్న
- డేటీ లీక్ చేసి, మెరిట్ లిస్టులను మాయం చేస్తూ ద్రోహం చేశారని మండిపాటు
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించింది మెగా డీఎస్సీనా లేక నిరుద్యోగులను మోసం చేసిన దగా డీఎస్సీనా అని వైసీపీ అధినేత జగన్ నిలదీశారు. తమ హయాంలో ఇచ్చిన డీఎస్సీని రద్దు చేసి, కావాలనే ఆలస్యం చేస్తూ కొత్త నోటిఫికేషన్‌తో పబ్లిసిటీ చేసుకున్నారని విమర్శించారు. తీరా చూస్తే పేపర్లు లీక్ చేసి,



# రతన్ టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం

– 2026 జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) వెన్నెముక అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ రంగం యువత కలలకు వేదికని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్‌లో స్టాళ్లను సందర్శించి, స్టార్టప్ సంస్థలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం 38 పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈ అని అన్నారు. మహిళా ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసేది ఎంఎస్ఎంఈలే. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదిక కావాలి. ఈ వేదిక ద్వారా అనేక ఒప్పందాలకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో కోటి ఎంఎస్ఎంఈలు ప్రారంభం కావాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో 550 ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు వస్తున్నాయి. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదికలు కావాలని చంద్రబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరిట ఓ కళావేదికను ఇవాళ ప్రారంభించు కుని ఎంఎస్ఎంఈ సమ్మిట్ – 2026 నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 4.4 ఎకరాల్లో 1.45 చదరపు అడుగుల స్థలంలో ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మించామని తెలిపారు. ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఇదేనని చెప్పుకొచ్చారు. ఏపీలో వనరులు వినియోగిం చుకునేలా ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తీసుకువచ్చామని సీఎం పేర్కొన్నారు. ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామిక యూనిట్‌లు, నిపుణులు, బ్యాంకులు ఒకే వేదికపైకి వచ్చాయని వివరించారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. రూ.500 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు కూడా ఇప్పటికే విడుదల చేశామని చెప్పుకొచ్చారు. రూ.200 కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నామని వివరించారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఏంఎస్ఎంఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇవాళ శంకుస్థాపన చేసిన 38 పార్కులతో పాటు వందపార్కులకు ఇప్పటికే శంకుస్థాపన చేశామని ప్రస్తావించారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఈ పారిశ్రామిక పార్కులకు భూములు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు కూడా ఇన్సెంటివ్స్ ఇస్తామని స్పష్టం చేశారు. శ్రీసిటీ విజయవంతమైన పారిశ్రామిక పార్క్ అని చెప్పుకొచ్చారు. రూ.28 వేల కోట్ల కార్పస్ ఫండ్ డ్వాక్రా మహిళల సంఘాల వద్ద ఉందని తెలిపారు. ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా సంఘాల మహిళలను ఎంటర్ ప్రెన్యుర్లుగా మారుస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు టిజి భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, శ్రీనివాస్, ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# పదవుల కోసం వారు అక్కర్లేదు

పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడి పోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు' అంటూ పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. తాను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా.. అంటూ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో బదులిస్తామని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇకపోతే కుల రాజకీయాలు, ప్రత్యర్థి పార్టీల విమర్శలు, పార్టీ అంతర్గత పరిస్థితులపై జనసేన పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో రాజకీయాలు చాలా సాఫీగా సాగిపోయాయని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అక్కడి రాజకీయాలను చూస్తే అసూయ కలిగేంత సులభంగా జరిగాయని అన్నారు. తాను పదేపదే కులం గురించి మాట్లాడుతున్నానని కొందరు విమర్శిస్తున్నారని పేర్కొన్న పవన్.. తాను ఎప్పుడైనా కుల నాయకుడినని చెప్పానా? మిగతా పార్టీ నేతలు కులం గురించి మాట్లాడటం లేదా? అంటూ ప్రశ్నించారు. కులాలను రెచ్చగొట్టే మనస్తత్వం సమాజానికి మంచిది కాదని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన చర్చలపై కూడా ఆయన స్పందించారు. 'నేను అమిత్ షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదు? వైసీపీ నేత జైలుకెళ్లాలని నేను ఎందుకు కోరుకుంటాను? ఒక నాయకుడు జైలుకెళ్తే జనసేన ఎదుగుతుందా?' అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రితో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనే మాట్లాడతాం.. ఇలాంటి ఆరోపణలు చేయడం వ్యవస్థను అవమానపరచడమేనని పవన్ అన్నారు. తాను అమిత్ షాను కలిసింది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని స్పష్టం చేశారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు. 'మాకు కూడా కోపాలు, బాధలు ఉంటాయి. చూస్తూ ఊరుకుంటామని అనుకోవద్దు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది.. భరిస్తాం.. సహిస్తాం.. అవసరమైతే తాట తీస్తాం' అంటూ పవన్ హెచ్చరించారు.

# అభివృద్ధిని తట్టుకోలేక జగన్ అక్కసు

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రానికి హనీమూన్ నాయకుడని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభివర్ణించారు. పాత సారాని కొత్త సీసాలో నింపి మార్కెటింగ్ చేసినట్లు వైఎస్ జగన్ వ్యవహారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఓర్వలేక నిత్యం అక్కసు వెళ్లగక్కుతున్నాడంటూ జగన్‌పై ఆయన మండిపడ్డారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. విజయలక్ష్మి మినరల్స్‌తో మైనింగ్ దోపిడీ ప్రారంభించి.. భారతీ సిమెంట్స్, సండూర్ పవర్ వరకూ విస్తరించారని వివరించారు. దోపిడీ, బెదిరింపులు, మోసం చేసి.. సంపాదించిన నగదును రాజకీయాల్లో పెట్టి ఎదిగారని చెప్పారు. బలపనూరు నుంచి ప్రారంభమైన వైఎస్ కుటుంబ ప్రస్థానం రూ. లక్షల కోట్ల అవినీతి సామ్రాజ్యంగా విస్తరించిందని రవాణా శాఖ మంత్రి పేర్కొన్నారు. చెల్లని రూపాయిగా మారిన వైఎస్ జగన్‌ను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. జగన్‌తో పాటు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి వచ్చి మంచి సలహాలు ఇస్తే.. వాటిని స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఊళ్ళో పెళ్లికి కుక్కల హడావుడి అనే రీతిలో మహానాడు ప్రారంభం రోజు వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసిందని వ్యంగ్యంగా అన్నారు. వైఎస్ జగన్ నిర్వహించే ఈ కార్యక్రమం మహానాడుకు దిష్టిచుక్క లాంటిదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

# ఢిల్లీ చేరుకున్న నారా లోకేష్...

మంగళవారం (మే 26) ఉదయం 11 గంటలకు ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుంది.ప్ధానమంత్రి నరేంద్ర మోదీతో తనకున్న అనుభవాలను వివరిస్తూ శివరాజ్ సింగ్ చౌహాన్ "అప్నాపన్: మై ఎక్స్ పీరియెన్సెస్ విత్ నరేంద్ర మోదీ" అనే పుస్తకాన్ని రచించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు పలువురు జాతీయ స్థాయి నేతలతో పాటు లోకేష్‌కు కూడా ఆహ్వానం అందింది. ఈ నేపథ్యంలోనే ఆయన ఢిల్లీ పర్యటన ఖరారైంది.

# ఏపీలో వింత వాతావరణం: పగలు వడగాల్పులు.. సాయంత్రం పిడుగుల వానలు

ఏపీ నిప్పుల కుంపటిలా మండిపోతోంది. గత కొద్ది రోజులుగా భానుడి ప్రతాపానికి జనం అల్లాడిపోతున్నారు. ఓవైపు అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు ద్రోణి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం ఇవాళ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరనున్నాయి. ముఖ్యంగా ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతాయని అంచనా. శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లితో పాటు రాయలసీమ జిల్లాల్లో 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

# ఢిల్లీలో 'పద్మ' పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము...

చేతుల మీదుగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ ఏడాదికి గాను కేంద్ర ప్రభుత్వం మొత్తం 131 మందిని పద్మ పురస్కారాలకు ఎంపిక చేయగా, తొలి విడతలో భాగంగా 66 మందికి అవార్డులను ప్రదానం చేశారు.ఈ ఏడాది దేశ రెండవ అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్‌ను ఐదుగురికి ప్రకటించగా, తొలి విడత కార్యక్రమంలో భాగంగా ఇద్దరికి ప్రదానం చేశారు. బాలీవుడ్ దిగ్గజ నటుడు, 'హీ-మ్యాన్'గా పేరుగాంచిన స్వర్గీయ ధర్మేంద్రకు మరణానంతరం ఈ పురస్కారాన్ని ప్రకటించారు. ఆయన భార్య, ప్రముఖ నటి హేమమాలిని రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. ఈ సమయంలో ఆమె కుమార్తె అహనా దేవల్ కూడా వెంట ఉన్నారు. భర్త తరఫున పురస్కారం అందుకుంటూ హేమమాలిని భావోద్వేగానికి గురయ్యారు. షోలే, చుప్కే చుప్కే వంటి ఎన్నో మరపురాని చిత్రాలతో భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేసిన ధర్మేంద్ర, 2025 నవంబర్‌లో 89 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఇదే విభాగంలో ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు ఎన్. రాజం కూడా పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మ భూషణ్ పురస్కారాల విషయానికొస్తే, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యాపారవేత్త ఉదయ్ కోటక్‌ను వాణిజ్యం, పరిశ్రమల రంగంలో ఆయన చేసిన సేవలకు గాను పద్మ భూషణ్‌తో సత్కరించారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోష్యారి ప్రజా వ్యవహారాల విభాగంలో చేసిన కృషికి గాను పద్మ భూషణ్ అందుకున్నారు. ఇక పద్మ శ్రీ పురస్కారాల జాబితాలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ క్రీడా రంగంలో తన విశేష ప్రతిభకు గాను పద్మశ్రీ అవార్డును స్వీకరించారు. బెంగాలీ సినిమా సూపర్ స్టార్ ప్రసేన్జిత్ చటర్జీకి కళల విభాగంలో పద్మశ్రీ లభించింది. ఆయన 350కి పైగా చిత్రాలలో నటించి గుర్తింపు పొందారు. ప్రముఖ అడ్వర్టైజింగ్ దిగ్గజం, స్వర్గీయ పియూష్ పాండేకు కూడా మరణానంతరం పద్మశ్రీ ప్రకటించగా, ఆయన భార్య నీతా జోషి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వీరితో పాటు పారా-అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ప్రముఖ నటుడు, దర్శకుడు అరవింద్ వైద్య కూడా పద్మశ్రీ పురస్కార గ్రహీతలలో ఉన్నారు. ఇక, తెలుగు వాగ్గేయకారుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ తరఫున ఆయన తనయుడు పద్మశ్రీ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మిగిలిన పురస్కార గ్రహీతలకు త్వరలో జరగనున్న మరో కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

# నారా లోకేష్ ను పదవి నుంచి తొలగించండి

డేటా డిలీట్ చేసి, మెరిట్ లిస్టులను మాయం చేస్తూ అభ్యర్థులకు పెద్ద ద్రోహం చేశారని మండిపడ్డారు. ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఈ లీకులపై సీబీఐ చేత విచారణ జరిపించాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.పరీక్ష నిర్వహణలో చురుగ్గా పాల్గొన్న ఒక ఎస్ సీఈఆర్టీ (రాజజు=ు) అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఆ వివరాలను డేటాబేస్ నుంచి ఎందుకు డిలీట్ చేశారో, మెరిట్ లిస్టులను ఎందుకు దాచారో, టాపర్ వివరాలను ఎందుకు తొలగించారో స్పష్టం చేయాలన్నారు. కేవలం సెలెక్ట్ అయిన వారికి మాత్రమే నేరుగా మెసేజ్‌లు పంపి, కలెక్టర్ ఆఫీసుల్లో సెలక్షన్ లిస్టులు పెట్టకపోవడం వెనుక పెద్ద మతలబు ఉందన్నారు. డీఎస్సీలో 'స్పోర్ట్స్ కోటా' పోస్టులను ఒక్కొక్కటి రూ.15 లక్షలకు అధికార పార్టీ నాయకుడే ఇంటికి పిలిచి బేరసారాలు సాగించారని ఆరోపించారు. క్రీడా మైదానంలో అడుగుపెట్టని వారికి కూడా ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చి ఉద్యోగాలు అమ్ముకున్నారని, ఇది రిక్రూట్‌మెంటా లేక వేలం పాటా అని ధ్వజమెత్తారు. టెట్ కన్వీనర్‌గా ఉన్న అధికారే డీఎస్సీ పరీక్షకూ కన్వీనర్‌గా ఉన్నప్పటికీ... ఉన్నపళంగా ఆయన్ను తొలగించి జాయింట్ డైరెక్టర్‌ను కన్వీనర్‌గా ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ మెగా అవినీతిపై చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే లోకేష్‌ను పదవి నుంచి తప్పించి, సీబీఐ దర్యాప్తు కోరి ప్రతిభ గల అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# రైతులకు తీపి కబురు చెప్పిన తమిళనాడు సీఎం విజయ్

తమిళనాడులోని లక్షలాది మంది రైతులకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న సన్నకారు, చిన్న రైతులకు వర్తించేలా కీలక రుణమాఫీ పథకాన్ని సోమవారం ప్రకటించింది. వ్యవసాయ రుణాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. సోమవారం చెన్నైలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మంత్రి ఎం. వినోద్, సహకార శాఖ మంత్రి వి. గాంధీరాజ్, ఆర్థిక మంత్రి ఎన్. మరియా విల్సన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఎవరికి ఎంత మాఫీ?** ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకం కింద, వివిధ కేటగిరీల రైతులకు రుణ పరిమాణాన్ని బట్టి మాఫీ వర్తిస్తుంది. సన్నకారు రైతులు: రూ.50,000 వరకు తీసుకున్న పంట రుణాలు పూర్తిగా మాఫీ అవుతాయి. రూ.50,001 నుంచి రూ.1 లక్ష వరకు ఉన్న రుణాలకు రూ.5,000 నుంచి రూ.40,000 వరకు పాక్షిక మాఫీ లభిస్తుంది. చిన్న రైతులు: రూ.50,000 వరకు తీసుకున్న రుణాలపై 50 శాతం మాఫీ వర్తిస్తుంది. రూ.50,001 నుంచి రూ.1 లక్ష వరకు ఉన్న రుణాలకు రూ.5,000 నుంచి రూ.20,000 వరకు ఉపశమనం కల్పించారు. పెద్ద రైతులు: సహకార బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న అర్హులైన పెద్ద రైతులకు ఈ పథకం కింద రూ.5,000 మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ రుణమాఫీ పథకం ద్వారా రాష్ట్రంలోని రైతులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని, వ్యవసాయ రంగానికి ఇది ఎంతో చేయూతనిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేస్తే చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తాం: కవిత హెచ్చరిక



ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తే సీఎం చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఆమె 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను జనసేన పార్టీ, ఏపీ పోలీసులు, అక్కడి ప్రభుత్వం కేసుల పేరుతో వేధిస్తున్నాయని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా విశ్లేషణలు చేసే నాగేశ్వర్‌పై ఉద్దేశపూర్వకంగానే అక్రమ కేసులు బనాయించి కుట్రలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. తెలంగాణ సమాజం, తెలుగు ప్రజలు గౌరవించే ఒక మేధావిపై ఏపీ ప్రభుత్వం కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆమె తెలిపారు. హైదరాబాద్‌లో నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆమె హెచ్చరించారు. ఇదే క్రమంలో తెలంగాణ ప్రభుత్వంపై కూడా కవిత విమర్శలు చేశారు. భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ వాహనం ఇవ్వకపోవడంతో, వడదెబ్బ మృతుడి కుటుంబం మృతదేహాన్ని కిలోమీటరుకు పైగా భుజాలపై మోసుకెళ్లిన ఘటనపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో రేవంత్ రెడ్డిది అమానవీయ ప్రభుత్వమని, పేదల పట్ల ఎంత నిర్దయగా ఉందో అర్థమవుతోందని కవిత 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సిజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా ఖండించారు. తన ఖాతా హ్యాక్ కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందినవారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాలనుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరులుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.

# పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన రుబియో.. భారత్, పాక్ సంబంధాల గురించి స్పందించారు. 'భారత్‌కు పాకిస్థాన్ విషయంలో ఉన్న ప్రధాన ఆందోళనలు ఉగ్రవాద సంస్థల గురించే. వాటికి ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ పాత్రతో సంబంధం లేదు. పాక్ భూభాగం నుంచి పనిచేస్తూ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న సాయుధ ఉగ్రవాద బృందాల గురించే ఇండియన్లు ఎక్కువగా మాట్లాడతారు. వారు దాని గురించే ఎప్పుడూ ఆందోళన చెందుతూ ఉంటారు. కానీ ఇరాన్ విషయంలో మధ్యవర్తిత్వం గురించి ప్రస్తావన రాలేదు. దాని గురించి వారు ఫిర్యాదు చేస్తారని నేను అనుకోను' అని రుబియో పేర్కొన్నారు. ఞారతదేశం అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి అని, ప్రముఖ వాణిజ్య భాగస్వామి అని రుబియో అభివర్ణించారు. 'ఈ బంధం బలంగా కొనసాగుతుందని నేను భావిస్తున్నాను. ప్రస్తుత అమెరికా పరిపాలన ముగిసేనాటికి రెండు దేశాల మధ్య బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను' అని రుబియో అన్నారు.

# నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ.8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

# దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

పూర్తిగా ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు ఇంత బాధపడటం మొట్టమొదటి సారి చూస్తున్నామన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో వరి ధాన్యాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రభుత్వం ఉన్నా ఇట్లాంటి దుర్భర పరిస్థితులు ఎదురు కాలేదని చెప్పుకొచ్చారు. 'ఉత్తమ్ నీది నోరా మోరా.. మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అనడం ఎంతవరకు సబబు' అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం కాదని.. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కోటి మెట్రిక్ టన్నుల ధాన్యంలో 70 లక్షలు కొంటే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. తాలు పెడితే తోలు తీస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోలు తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని విమర్శించారు. రోహిణి కార్తె వచ్చినా కళ్లాల్లోనే ధాన్యం, రైతులు ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని తెలిపారు. రైతులు గుండెలు బాదుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదంటూ విమర్శలు గుప్పించారు. వరి కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఞాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు వదిలారని హరీశ్ రావు తెలిపారు. 'మిషన్ మోడ్‌లో వడ్లు కొనాలని రేవంత్ అంటున్నారు. నీది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్. నిన్న కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశించారు. రైతుల ఆశలు నిరాశ అయ్యాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా వేయలేదు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే... దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన రకం నువ్వు. ఢిల్లీ ట్రిప్పులు మాని.. లారీల ట్రిప్పులు పెంచు. ఒకటి, రెండు రోజుల్లో మార్పు రాకుండే స్వయంగా నేనే కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతా. వేలాది మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లను దిగ్బంధిస్తాం. రాజకీయ విమర్శలు మాని పరిష్కార మార్గాలు చూడండి' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# వాత తప్పదా?..

**తీరని నష్టాలు** ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం లాంటి ప్రభుత్వ రంగ సంస్థల నష్టాలు తాజా పెంపుతో పూర్తిగా భర్తీ కాలేదు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు, మన రిటైల్ ధరలకు ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేయాలంటే లీటరుపై మరో రూ.20 నుంచి రూ.33 వరకు పెంచాల్సి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే అంత భారం ఒకేసారి వేయడం సాధ్యం కాకపోయినా విడతల వారీగా బాదుడు తప్పకపోవచ్చు.

**రూ.1.2 లక్షల కోట్ల భారం**ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ వివాదం వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. కానీ మనదేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల కారణంగా వరుసగా 74 రోజుల పాటు ఇంధన ధరలను పెంచకుండా నిలిపివేశారు. భారత్ తన అవసరాల కోసం 88 శాతం ముడిచమురును దిగుమతి చేసుకుంటుంది. ధరలు స్థిరంగా ఉంచడం వల్ల ఈ మూడు ప్రభుత్వ రంగ సంస్థలపై ఏకంగా రూ.1.2 లక్షల కోట్లకు పైగా అదనపు భారం పడింది.

**క్రూడాయిల్ తగ్గినా**

ఇరాన్, అమెరికా మధ్య చర్చలు సఫలమైతే అది మన చమురు సంస్థలకు ఊరటనిస్తుంది. అయినా రవాణా ఖర్చులు,

పాత నష్టాల వల్ల ధరల భారం వెంటనే తగ్గే అవకాశం లేదు. ఇటు ప్రజలపై ద్రవ్యోల్బణ భారం పడకుండా అటు చమురు సంస్థలు నష్టపోకుండా చూడటం ఇప్పుడు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

# యుద్ధం వద్దు.. శాంతి ముద్దు

## ఇస్కఫ్ నంద్యాల జిల్లా ప్రథమ మహాసభల పిలుపు




**నంద్యాల ప్రతినిధి. మే 25. (నంది పత్రిక ):**ప్రపంచ శాంతి, దేశాల మధ్య సౌభ్రాతృత్వం, స్నేహభావమే లక్ష్యంగా 'భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం' (ఇస్కఫ్) ప్రయాణిస్తోందని ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగా శ్రీధర్ రావు స్పష్టం చేశారు.నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో ఇస్కఫ్ నంద్యాల జిల్లా ప్రథమ మహాసభ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఎస్. రియాజ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుండి మేధావులు, విద్యావంతులు, యువత, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగా శ్రీధర్ రావుతో పాటు రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి.వి. శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి కె. వసంత బాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1941లో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల ఆధ్వర్యంలో 'ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్' పేరుతో ప్రారంభమైన ఈ సంస్థకు 84 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందన్నారు. నాటి నుండి నేటి వరకు ప్రపంచ శాంతి కోసం ఇస్కఫ్ నిరంతరం కృషి చేస్తోందని కొనియాడారు.యుద్ధాలు ప్రపంచ మానవాళి మనుగడకే ప్రమాదకరమని, యుద్ధాల వల్ల నష్టపోయేది కేవలం సామాన్య ప్రజలేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అమెరికా దేశం తన ఆయుధ మార్కెట్‌ను పెంచుకోవడం కోసం దేశాల మధ్య యుద్ధాలను పురికొల్పుతోందని ,ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్నిపెంచి పోషిస్తున్నదిఅమెరికాయేన నిదుయ్యబట్టారు.అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ సంక్షోభం ఏర్పడి, అనేక దేశాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయని.. దీనివల్ల సామాన్యులకు తినడానికి తిండి కూడా దొరకని పరిస్థితి దాపురిస్తోందని హెచ్చరించారు. ఇరాన్ అధ్యక్షులు మరణిస్తే కనీసం దేశ ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం కూడా తెలపకపోవడం దారుణమన్నారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సమాజంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి, ప్రజలను విభజించి పాలిస్తోందని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకొని, ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత సిగ్గుచేటన్నారు. అలాగే తెలంగాణలో ఇటీవల జరిగిన బండి సంజయ్ కుమారుడి అత్యాచార ఉదంతాన్ని వారు తీవ్రంగా ఖండించారు.నేడుగ్రామ స్థాయి నుండి పట్టణాల వరకు సారా, నకిలీ మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మహమ్మారులు విచ్చలవిడిగా విస్తరించాయని, వీటికి బానిసలై యువత బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో జరుగుతున్న అనేక దొంగతనాలు, లైంగిక దాడులు, చిన్న పిల్లలపై అత్యాచారాలకు చెడు వ్యసనాలే కారణమవుతున్నాయన్నారు.కోవిడ్ సంక్షోభ సమయంలో ప్రాణాలకు తెగించి దేశ ప్రజలందరికీ సేవ చేసింది కేవలం ప్రభుత్వ వైద్యులు, ప్రభుత్వ సిబ్బంది మాత్రమేనని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఇస్కఫ్ ద్వారా సమాజంలోని యువకులను, మేధావులను ఏకం చేసి, సమాజాన్ని మేలుకొలిపే సమయం ఆసన్నమైందని వక్తలు పిలుపునిచ్చారు.నంద్యాల జిల్లాలో సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మేధావులు, యువత, విద్యార్థులు నడుం బిగించాలని పిలుపు నిచ్చారు.అనంతరం నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నిక చేయడం జరిగింది.జిల్లా గౌరవ అధ్యక్షులుగా షేక్ అబులేష్. జిల్లా అధ్యక్షులుగా ఎం షణ్ముఖరావు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్ రియాజ్. జిల్లా ఉపాధ్యక్షులుగా. సంజీవ రాయుడు మధు కుమార్. జిల్లా సహాయ కార్యదర్శిగా ఎస్ బాబా ఫక్రుద్దీన్. సీఎన్ శివరాం రెడ్డి. కోశాధికారిగా పి మురళీధర్. లతపాటు 27 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

# నగరపాలక సంస్థకు 30వినతులు.

## ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ మే 25నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 21 మంది వినతులు సమర్పించగా, 9 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా సంజీవయ్య నగర్ నందు రోడ్డును ఆక్రమించి టిఫిన్ దుకాణం నడుపుతున్నారు చర్యలు తీసుకోవాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, వాటర్ పన్ను ఎక్కువగా వస్తోంది పరిశీలించి పరిష్కరించాలని, ఐ ఎస్ మహల్ వద్ద గల తుడా అపార్ట్మెంట్ నందు కామన్ ఏరియా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు పరిష్కరించాలని, తెలుగుగంగ నీరు సక్రమంగా సరఫరా చేయాలని, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలని, పాత అలిపిరి రోడ్డు నందు అక్రమ వ్యాపారాలు చేస్తున్నారు తొలగించాలని, నగరంలో పుట్ పాత్ లు లేక ప్రజలు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు పరిష్కరించాలని, జగన్మాత చర్చి వద్ద కాలువ నుండి మురుగునీరు బయటకు వస్తోంది పరిష్కరించాలని, అబ్బన్న కాలనిలో రోడ్డులో ర్యాంపులు ఏర్పాటు చేయడంతో ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, లీలామహల్ వద్ద గల చేపల మార్కెట్ వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

# పారిశ్రామిక రంగానికి పెద్దపీట







## కడపలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల నిర్మాణానికి త్వరలోనే డిమాండ్ సర్వే

## జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

## కడప నగర సమగ్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యం:

## ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి

**వైఎస్ఆర్ కడప జిల్లా,బ్యూరో చీఫ్ మే 25నంది పత్రిక**

కడప నియోజకవర్గం లో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడానికి, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల కాన్సెప్ట్‌ను తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో ఎం ఎస్ ఎం ఈ గ్రోత్ సమ్మిట్ 2026 లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టు నకు శంకుస్థాపన చేయగా...కడప నగరంలోని ఇండస్టియల్ డెవెలప్మెంట్ పార్క్ లో 2.07 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ ఎఫ్ సి) నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి... ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు సాధారణ అపార్ట్ మెంట్ ల వలె కాకుండా, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక డిజైన్లతోరూపొందు తున్నాయని స్పష్టం చేశారు. ఒక స్క్వేర్ మీటర్‌కు దాదాపు ఐదు టన్నుల బరువును మోయగల సామర్థ్యంతో, భారీ ఎక్విప్‌మెంట్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ప్రొడక్షన్ చేయడానికి వీలుగా వీటిని డిజైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, పై అంతస్తులకు ముడిసరుకును తరలించడానికి మరియు ఫినిష్డ్ ప్రొడక్ట్స్‌ను కిందికి తెచ్చేందుకు పారిశ్రామిక గ్రేడ్ లిఫ్ట్ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.ప్రస్తుతం నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లో సుమారుగా 25 యూనిట్లు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ తెలిపారు. పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా ఇంటర్నల్ పార్టిషన్స్ మార్చుకునే వీలుందని, ఎవరికి ఎంత స్థలం (500 చాట్ లేదా 1500 చాట్) కావాలో తెలుసుకోవడానికి వీలుగా తక్షణమే డిమాండ్ సర్వే నిర్వహించాలని ఏపీఐఐసి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రూ. 15 కోట్లతో 50,000 చాట్ విస్తీర్ణంలో ఫేజ్-1 పనులు జరుగుతుండగా,ఇది పూర్తి కాగానే ఇదే ప్రాంగణంలో మరో రూ. 15 కోట్లతో ఫేజ్-2 (మరో 50,000 చాట్) నిర్మించడానికి తగిన స్థలం అందుబాటులో ఉందని కలెక్టర్ వివరించారు.దాదాపు 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న కడప ఇండస్ట్రియల్ పార్కులో ప్రస్తుతం 165కు పైగా పరిశ్రమలు విజయవంతంగా నడుస్తున్నాయని, ఇవి ఏటా రూ. 250 నుండి రూ. 300 కోట్ల టర్నోవర్‌తో నగర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 4,000 మందికి నేరుగా ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. కడప నగరంలో ప్రైవేట్ వ్యక్తులకు 2,000 స్క్వేర్ మీటర్ల పైబడి భూమి ఉంటే, వారు సొంతంగా లేదా ఏపీఐఐసి తో జాయింట్ వెంచర్ ద్వారా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలను నిర్మించుకోవచ్చని తెలిపారు. వీటికి అవసరమైన రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతులను ప్రభుత్వం ప్రాధాన్యతపై కల్పిస్తుందని, గరిష్టంగా 60 శాతం వరకు సబ్సిడీ పొందే అవకాశం కూడా ఉందని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా ఒక టైర్-3 నగరంలో యువతను టార్గెట్‌గా చేసుకుని "స్టార్టప్ కడప"ను వచ్చే నెలలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని కలెక్టర్ ప్రకటించారు. పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి సాయం, బ్యాంకింగ్ రుణాలు మరియు ప్రభుత్వ అనుమతుల ప్రక్రియను డిజిటల్ విధానంలో వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఆరు నెలల్లో ఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ మరియు కడప శాసన సభ్యురాలు రెడ్డప్పగారి మాధవి రెడ్డి మాట్లాడుతూ...లి కడప నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రాయలసీమను ఐటీ, పారిశ్రామిక రంగాలుగా తీర్చిదిద్ది, ఇక్కడి రైతుల బిడ్డలు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా స్థిరపడేలా చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడుదేనని ఆమె కొనియాడారు. ఇప్పుడు 'పూర్వోదయ' పథకం ద్వారా రూ. 40,000 కోట్లతో రాయలసీమను ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. అలాగే, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చొరవతో కేవలం 30 నుండి 45 రోజుల్లోనే ప్రక్రియ పూర్తి చేసి, పొరుగు రాష్ట్రాల పోటీని తట్టుకుని అనంతపురం జిల్లా పుట్టపర్తి పరిధిలో ఫిఫ్త్ జనరేషన్ 'ఫైటర్ జెట్స్' పరిశ్రమకు భూమి పూజ చేయడం జరిగిందని, ఇది మన స్వదేశీ టెక్నాలజీతో రూపుదిద్దుకోనుందని ఆమె వెల్లడించారు.

కడపలో సరికొత్త పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతూ, చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారస్తుల (కార్పెంటర్స్, సోఫాలు, మంచాలు, గార్మెంట్స్ తదితర రంగాలు) కోసం ఈ ఎంఎస్ఎంఈ పార్కులో రెంట్ లేదా కొనుగోలు పద్ధతిలో 25 గదులతో కూడిన ప్లగ్ అండ్ ప్లే మోడల్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ పారిశ్రామిక పార్కులో 50 శాతం ఆక్యుపెన్సీ పూర్తి కాగానే రెండవ వెంచర్ కూడా ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ వెంచర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సైబర్ కేర్, ఏటీఎం, రా మెటీరియల్ స్టోరేజ్, విశాలమైన పార్కింగ్ మరియు సీసీ రోడ్ల వంటి అత్యాధునిక వసతులు కల్పించినట్లు చెప్పారు.దీనితో పాటు రాబోయే ఒకటి రెండు నెలల్లో యువత, ఐటీ నిపుణుల కోసం "స్టార్టప్ కడప"ను ప్రారంభించబోతున్నామని, దీని ద్వారా యువ పారిశ్రామికవేత్తలకు లోన్లు, మెంటార్షిప్ సేవలు అందుతాయని ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డిఓ మురళి, ఏపిఐఐసి జెడ్ ఎం శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రీస్ జిఎం చాంద్ బాష సంబంధిత అధికారులు, ప్రోత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కడప,బ్యూరో చీఫ్ మే 25 నంది పత్రిక** సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా.. ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ల పరిస్థితిని తనిఖీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఈ. శ్రీకాంత్ రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవాధారిత వివరాలతో వినతులు సమర్పించాలి..!

## డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పిలుపు

**వై ఎస్ ఆర్ కడపబ్యూరో చీఫ్ , మే 25నంది పత్రిక** : గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేస్తున్న "డెడికేటెడ్ కమిషన్"కు వాస్తవాధారిత సమాచారంతో కూడిన వినతులనే సమర్పించాలని ప్రజలు, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులకు.. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఐఏఎస్ (రిటైర్డ్) సూచించారు.సోమవారం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లికార్జునతో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించిన "గ్రామీణ పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఆమలు"పై అధ్యయనం మరియు వినతుల స్వీకరణ" కార్యక్రమంలో డెడికేటెడ్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా పాల్గొని ప్రసంగించి.. అనంతరం విజ్ఞప్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా ఐఏఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం.03, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా గౌరవ సుప్రీంకోర్టు వివిధ తీర్పుల మేరకు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను అమలు చేయడానికి ఈ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల శాతం నిర్ణయించేందుకు రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయంగా,అనుభవాధారితంగా అధ్యయనం చేయడం కమిషన్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.

బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబడిన స్థితిగతులు ఏ మేరకు ఉన్నాయో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వాటి ప్రభావాన్ని అంచనా వేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులు,మెమోరాండములు కమిషన్‌కు ఎంతో ఉపయోగపడతాయని, అందులో పేర్కొనే ప్రతి అంశం వాస్తవాధారితంగా ఉండాలని స్పష్టం చేశారు. వినతిపత్రాలతో పాటు సంబంధిత పత్రాలు, ఆధారాలు,గణాంకాలు, నివేదికలు, ధృవీకరణ పత్రాలు కూడా సమర్పించాలని సూచించారు. తమ వద్ద లేని పత్రాలు ఎవరి నుంచి పొందవచ్చో వారి వివరాలను కూడా తెలియజేయాలని కోరారు. కమిషన్ పరిశీలనలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు.ఈ ప్రక్రియ లో ప్రజల భాగస్వామ్యం కీలకమని,బీసీల స్థితిగతులపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. కమిషన్ నిర్వహిస్తున్న అధ్యయనం బీసీ వర్గాల భవిష్యత్తు ప్రాతినిధ్యానికి కీలకమైందని పేర్కొన్నారు. ప్రజలు సమర్పించే వినతులు సమగ్రంగా, స్పష్టంగా ఉండేలా అధికారులు మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈ ఓ సుబ్రమణ్యం, డిపిఓ వెంకట సుబ్బయ్య, సీపీఓ హజరతయ్య, జిల్లా బిసి సంక్షేమ మరియు సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు,కడప, అన్నమయ్య జిల్లాల సంబంధిత శాఖల అధికారులు,కుల సంఘాల ప్రతినిధులు,ప్రజా ప్రతినిధులు,పౌర సమాజ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత.

## కమిషనర్ (ఎఫ్.ఏ.సి.)శారదా దేవి.

**తిరుపతి బ్యూరో చీఫ్ మే 25నంది పత్రిక** పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని గోదాదేవి మార్గం, గాంధీ భవన్, మంచినీళ్ళ కుంట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ జూన్ 22 వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో వారం ఒక్కో అంశంతో పారిశుద్య పనులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని అన్ని కాలువలు, కుంటలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. మన ఇల్లే కాకుండా పరిసరాలతో పాటు నగరాన్ని శుభ్రంగా ఉంచుకునేందుకు అందరూ కంకణబద్దులు కావాలని అన్నారు. ప్రజలందరూ భాగస్వాములై స్వచ్ఛ తిరుపతి సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని గోదాదేవి మార్గం, గాంధీ భవన్, మంచినీళ్ళ కుంట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ జూన్ 22 వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో వారం ఒక్కో అంశంతో పారిశుద్య పనులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని అన్ని కాలువలు, కుంటలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. మన ఇల్లే కాకుండా పరిసరాలతో పాటు నగరాన్ని శుభ్రంగా ఉంచుకునేందుకు అందరూ కంకణబద్దులు కావాలని అన్నారు. ప్రజలందరూ భాగస్వాములై స్వచ్ఛ తిరుపతి సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పాల్గొన్నారు.



# ధ్యానంతో ఒత్తిడి దూరం సేవల్లో మరింత సమర్థత.






## ఒత్తిడి నివారణకు పోలీసులకు యోగా, ధ్యాన శిక్షణ.

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ ఆదేశాల మేరకు, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బందికి మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం కోసం మూడు రోజుల పాటు ప్రత్యేక హార్ట్‌ఫుల్‌నెస్ వారి ఆధ్వర్యంలో మెడిటేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో మే 25, 26, 27 తేదీల్లో పోలీసులకు ధ్యాన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన సాధన చేశారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు మరియు ట్రైనర్లు సిబ్బందికి శ్వాసక్రియలు, ఏకాగ్రత పెంపొందించే సాధనలు, మానసిక ఒత్తిడిని తగ్గించే ధ్యాన విధానాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ...ధ్యానం ద్వారా ఒత్తిడి తగ్గి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని పోలీసు అధికారులు తెలిపారు. పోలీసు విధుల్లో ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళనలను తగ్గించేందుకు యోగా, ధ్యానం ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం పెంపొందడంతో పాటు విధి నిర్వహణలో మరింత సమర్థత సాధించవచ్చని పేర్కొన్నారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించడంలో యోగా, ప్రాణాయామం కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వీటిని అలవాటు చేసుకోవాలని సూచించారు. డీఐజీ కార్యాలయశీ, జిల్లా పోలీస్ కార్యాలయం తో పాటు సిఐడి, ఏపీఎస్పీ రెండో బిటాలియన్, వెల్దుర్తి, క్రిష్ణగిరి, ఆదోని, పత్తి కొండ, ఎమ్మిగనూరులలో పోలీసులకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మెడిటేషన్ తరగతులు ఈ మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, మహిళా పీఎస్ డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు , డిఐజి, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది , హార్టఫుల్ నెస్ సంస్థ జిల్లా సమాన్వయకర్త (డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ )శ్రీ వెంకట రెడ్డి, ట్రైనర్ లు రవీంద్రనాథ్, వంశీ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...





**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ .**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 129 ఫిర్యాదులు.**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ.**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 129 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...** 1) నా కోడలుకు గవర్నమెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ . 4 లక్షలు తీసుకొని మోసం చేసిన సి. బెలగల్ కు చెందిన ఎర్రన్న పై చర్యలు తీసుకోవాలని క్రిష్ణగిరి మండలం, ఆగవేలి గ్రామం కు చెందిన కె.లింగన్న ఫిర్యాదు చేశారు.

2) కర్నూలు చెందిన ఒక ప్రైవేటు హోమ్ లోన్ ఫైనాన్స్ కంపెనీ నుండి రూ. 6 లక్షలు గృహ రుణం తీసుకున్నాను.

72 నెలలు మాత్రమే కట్టాలని చెప్పారు. 60 నెలలు లోన్ కట్టాము. ఇంకా 204 నెలలు కట్టాలని మోసం చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోడుమూరు కు చెందిన కర్ణ గోపాల్ ఫిర్యాదు చేశారు. 3) 30 ఏళ్లుగా జీవనోపాధిగా ఉన్న నా కూరగాయల బంకును ఆక్రమించుకున్న వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండలం, రామళ్లకోట గ్రామానికి చెందిన రాములమ్మ ఫిర్యాదు చేశారు. 4) బ్రాహ్మణకోట్కూరు కు చెందిన గొల్ల నాగశేషులు ట్రాక్టర్ అద్దెకు తీసుకుని, అద్దె చెల్లిస్తానని చెప్పి 4 నెలల పాటు నెలకు రూ.20 వేలు చెల్లించారు. ట్రాక్టర్‌ను తిరిగి ఇవ్వకుండా, ట్రాక్టర్ తో పాటు కనిపించకుండా ఎక్కడికో పరారయ్యారు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. ఆచూకీ విషయం పై తగిన చర్యలు తీసుకోవాలని కర్నూలు, మారుతీనగర్‌కు చెందిన రామాంజనేయులు ఫిర్యాదు చేశారు. 5) ఇల్లు ఆక్రమించుకోవాలని ప్రయత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు వన్ టౌన్ , గడ్డ వీధి కి చెందిన షేక్ మైమునా ఫిర్యాదు చేశారు.

6) నా తమ్ముడు మునిస్వామి నాకు తెలియకుండా 2 ఎకరాల పొలము, ఇల్లు అమ్ముకుని మోసం చేశాడని ఆలూరు మండలం, మొలగవల్లి గ్రామం కు చెందిన వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు మహిళా పీఎస్ డీఎస్పీ ఉపేంద్ర బాబు , సిఐలు రామయ్య నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

# ఫిజిక్స్ వాలా పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్న బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి : విద్యార్థి సంఘాలు



## సీబీఎస్ఈ నిబంధనలను ఉల్లంఘిస్తున్న బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ : విద్యార్థి సంఘాలు

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** సీబీఎస్ఈ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, ఫిజిక్స్ వాలా వంటి కోచింగ్ సంస్థలతో భాగస్వామ్యం పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్న బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎ-పిడిఎస్యు-ఆర్పిఎస్ఎఫ్- జాతీయ బీసీ విద్యార్థి సంఘం -నర్సింగ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ గారికి వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఎఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసుగారి నాగార్జున , పిడిఎస్యు రాష్ట్ర నాయకులు కే రమణకుమార్, ఆర్పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరీష్ నర్సింగ్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్ నాయుడు మాట్లాడుతూ... బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ 6 తరగతి నుండి 10 తరగతి లోపే జేఈఈ, ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తామని, "ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్స్", పేర్లతో ప్రచారం చేస్తూ భారీ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యాసంస్థ వ్యవహారం ఆందోళనకరమన్నారు. సీబీఎస్ఈ నిబంధనల ప్రకారం పాఠశాలలు విద్యార్థులపై అధిక ఒత్తిడి, బలవంతపు కోచింగ్, తప్పుడు ప్రకటనలు చేయకూడదని ఉన్నప్పటికీ, బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ మాత్రం కోచింగ్ సెంటర్ తరహాలో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఫిజిక్స్ వాలా పేరును ఉపయోగించి ప్రత్యేక ఫలితాలు వస్తాయని ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షించడం మోసపూరిత చర్య అన్నారు. అదేవిధంగా ముందస్తు అడ్మిషన్లు, అధిక ఫీజులు, అనుమతులకు విరుద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించడం వంటి అంశాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు, సీబీఎస్ఈ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ర్యాంకుల పేరుతో కార్పొరేట్ సంస్కృతిని రుద్దుతు విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ నిర్వహణపై విచారణ జరిపి, గుర్తింపు రద్దు సహా కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అలాగే జీవో నెంబర్1కి విరుద్ధంగా పాఠశాల ఆవరణంలో యూనిఫామ్‌లు, పుస్తకాలు, షూస్ తదితరాలను విక్రయిస్తూ స్కూల్ ని వ్యాపార కేంద్రంగా మార్చారని విమర్శించారు. విద్యను వ్యాపారంగా మార్చే ఇటువంటి విద్యాసంస్థలను నియంత్రించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసా జిల్లా సహాయ కార్యదర్శి సాయి పవన్ విద్యార్థి సంఘాల నాయకులు కిరణ్,తేజ తదితరులు పాల్గొన్నారు..



# సుందరీకరణ విధ్వంసకులపై ఉదాసీనత తగదు

## బాధ్యులపై భారీ జరిమానాలు విధించండి

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** నగరాన్ని అందంగా, సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా లక్షల రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న సుందరీకరణ పనులపై పోస్టర్లు, బ్యానర్లు అతికించి పాడు చేసే వారిపై ఉదాసీన వైఖరి ప్రదర్శించవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. బళ్ళారి చౌరస్తా వద్ద ఇటీవల జాతీయ రహదారి రిటైనింగ్ వాల్‌పై రంగులు వేసి అందంగా తీర్చిదిద్దగా, కొందరు పోస్టర్లు అతికించి పాడు చేశారు. అలాగే డివైడర్లకు పోస్టర్లు అతికించి అపరిశుభ్రంగా మార్చారు. సోమవారం సదరు ప్రాంతాలను సందర్శించిన కమిషనర్, సంబంధిత వ్యక్తులకు కాల్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని, లేకపోతే మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బ్యానర్లు, పోస్టర్లు అతికించే వారిపై ఎలాంటి ఉదాసీన వైఖరి తగదని, కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భారీ జరిమానాలు విధించడంతోపాటు అవసరమైతే కేసులు సైతం నమోదు చేయాలని ఆదేశించారు. ఫ్లెక్సీల ప్రింటింగ్ నిర్వాహకులు, బ్యానర్లు అతికించే వారితో త్వరలో సమావేశం నిర్వహించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వచ్ఛత పనులకు ఆటంకం కలిగిస్తున్న సమస్యలను ఇంజనీరింగ్ విభాగ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించుకోవాలని నోడల్ అధికారి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.



# సమిష్టి కృషితో 'స్వచ్ఛ' నగరం

## 'స్వచ్ఛత'లో ప్రజల భాగస్వామ్యం అవసరం

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు






**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమం ద్వారా అత్యంత శుభ్రమైన నగరంగా కర్నూలును తీర్చిదిద్దేందుకు నగరపాలక యంత్రాంగం శ్రమిస్తుందని, నగర ప్రజలు తమ వంతు సహకారం అందిస్తేనే అది సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం బి.క్యాంపు సిల్వర్ జూబ్లీ కళాశాల వద్ద ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాదచారులతో కలిసి కమిషనర్ రహదారులపై స్వచ్ఛత పనులు నిర్వహించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లక్ష్యం, స్వచ్ఛత ఆవశ్యకతపై పాదచారులకు కమిషనర్ వివరించి చైతన్యపరిచారు. ప్రతి వ్యాపారి తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని దుకాణదారులకు సూచించారు. ప్రతి వాణిజ్య దుకాణం వద్ద డస్ట్‌బిన్ ఉండేలా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నెలరోజులపాటు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా నగరంలో ఎల్లో, రెడ్ పాయింట్లు, చెత్త పోగులు ఉండే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పూర్తిగా శుభ్రం చేస్తామన్నారు. నగరపాలక అధికారుల నుంచి పారిశుద్ధ్య కార్మికుల వరకు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2026లో కర్నూలు నగరం అగ్రస్థానంలో ర్యాంకు సాధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నగరం పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుద్ధ్య సిబ్బందితో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, నగరపాలక రిటైర్డ్ మేనేజర్ ఎన్. చిన్నరాముడు, లలితా కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రో, గ్యాస్ ధరలు రద్దుచేయాలి

## పి వై ఎల్ రాష్ట్ర కన్వీనర్ కే చిన్న ప్రసాద్ సబ్ కలెక్టర్ డిఏఓ వసుంధర గారికి వినతిపత్రం. అందజేశారు



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు వరుసగా నాలుగు సార్లు పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పివైఎల్ రాష్ట్ర కన్వీనర్ కె.చిన్నిప్రసాద్ అధ్యక్షతన ఆదోని సబ్ కలెక్టర్, సబ్ డివిజన్ కార్యాలయంలో, డిఏఓ అధికారి వసుంధర గారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు పి వై ఏ ఎల్. రాష్ట్ర కన్వీనర్ చిన్న ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న అప్రజాస్వామిక ప్రజావ్యతిరే విధానాలను తీవ్రంగా నిరసిస్తూ 2026, మే-25 నుండి 31 వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో పెట్రో, గ్యాస్, పెరుగుతున్న నిత్యవసర ధరలు, నిరుద్యోగ్యం లాంటి సమస్యలతో రైతాంగం ఎదుర్కొంటున్న అన్నిరకాల సమస్యలపై ఆందోళనలు, వినతిపత్రాలు సమర్పించండని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో బాగంగా ఆ పార్టీ అనుబంధ సంస్థ పివైఎల్ ఆధ్వర్యంలో పై కార్యక్రమం జరిగింది. ఆకలి, దారిద్ర్యం, ఆత్మహత్యలు, వలసలతో సతమతమవుతున్న సామాన్య పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలపై పెట్రో ధరల పెంపు మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లయ్యిందని చిన్నిప్రసాద్ పేర్కొన్నారు. ఇప్పటికై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ల ప్రయోజనాలకు పాటుపడే విధానాలు మానుకొని, తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత రాజ్యాంగ బద్దంగా ఎన్నికైన పాలకులపై ఉంటుందని తెలియజేశారు. దుర్మార్గమైన, అమానుష రాజ్యాంగ వ్యతిరేక చర్యలు ప్రజల జీవన ప్రమాణాలు కాలరాయడమేనని మండిపడ్డారు. అన్నివర్గల ప్రజలు బలమైన ప్రజా ఉద్యమాలు, వర్గపోరాటాలలో బాగస్వాములు అయినప్పుడే తిప్పుకొట్టగలమని స్పష్టం చేశారు. ఐ.ఎఫ్.టి.యు. ఆటో యూనియన్ నాయకులు నెహిమియా, పివైఎల్ అభి తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే

## జగనన్న సియం కావాలంటే బిఎల్ఏలతో పాటు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కష్టపడాలి.. బూత్ ఏజెంట్లు , వైఎస్సార్ సీపీ నేతలకు దిశ నిర్దేశం చేసిన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి



**మంత్రాలయం , మే 25,** ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే అని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలోని కర్నూలు పార్లమెంటు కో ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామలింగేశ్వరస్వామి కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్లు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ అధికారికంగా నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై వైఎస్సార్సీపీ బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హుల ఓట్లు తొలగించకుండా చూడాలని , ప్రతి ఓటూను కీలకంగా భావించాలని వైఎస్సార్ సీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తూ, ప్రభుత్వం అవినీతి పై ప్రజలకు వివరించాలన్నారు. జూలై 14 వరకు పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించే క్రమంలో మన పార్టీ తరపున నియమించబడ్డ బిఎల్ఏల, నాయకులు,కార్యకర్తలు ఓటరు జాబితా నందు పేరు ఉందో లేదో చూసుకోవాలని, సెప్టెంబర్ నెలలో తుది జాబితా వెలువడిన తర్వాత మళ్లీ పేరు నమోదు చేసుకొనే అవకాశం ఉండదన్నారు. 2029 ఎన్నికల్లో జగనన్న సియం కావాలంటే బిఎల్ఏలతో పాటు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కష్టపడాలన్నారు.. ఈ కార్యక్రమంలో మంత్రాలయం వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు భీంరెడ్డి , మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి ,కోసిగి మండలాధ్యక్షులు మురళీ రెడ్డి , పెద్దకడుబూర్ వైసీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి , రామ్మోహన్ రెడ్డి , నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వేణుగోపాల్ నగర్ లో పారిశుద్ధ్య లోపం.. ఎక్కడ చెత్త అక్కడే నిలిచిపోయిన వైనం..

## కుళాయి నీళ్లు రాక ప్రజల అస్తవ్యస్తం. ప్రజల కష్టాలు పట్టని పాలకులు: మూడో డివిజన్ వైసీపీ ఇన్చార్జ్ అక్కల రెడ్డి నారాయణరెడ్డి.







**నెల్లూరు మే 25 నంది పత్రిక:** ఎన్నికలవేళ ప్రజల వద్దకు చేరి ప్రజలకు అవి చేస్తాను ఇవి చేస్తాము అంటూ ప్రలోభాలు పలుకుతూ.. ఎన్నికల ముగిసిన తరువాత పత్తా లేకుండా వెళ్ళిపోతున్న నాయకులురోజు రోజుకి ఎక్కువై పోతున్నారు.వారి స్వభావాన్ని రోజు రోజుకి ప్రజలు మీద రుద్దుతూ గెలిచిన తర్వాత ప్రజల కష్టాలను గాలికి వదిలేస్తూ ప్రజలకు అండగా ఉండవలసిన నాయకులు కాలయముడై నిలుస్తున్న సందర్భాలు ఎన్నో లేకపోలేదు. వివరాలలోకి వెళితే నెల్లూరు సిటీ మూడవ డివిజన్ పరిధిలోని వేణుగోపాల్ నగర్ లో రోజురోజుకి పారిశుద్ధ్యలోపం ఎక్కువ ఐపోతుంది.ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతుందని ప్రతి ఇంటికి కులాయి కలెక్షన్ ఉన్న ఒక్క నీటి చుక్క రాక బజారులలో ఒకటో రెండో కుళాయిలు ఉండగా వాటిలో పది నిమిషాలు నీరు వస్తే మరో ఐదు గంటలపాటు నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. పారిశుద్ధ్య కార్మికులు పదిరోజులకు ఒకసారి 20 రోజులకు ఒకసారి వచ్చి చట్టపు చూపులాగా చూసి వెళుతున్నారని.. మూడవ డివిజన్ వైసీపీ ఇన్చార్జ్ అక్కల రెడ్డి నారాయణరెడ్డి పాలకులపై మరియు పారిశుద్ధ్య వ్యవస్థ పై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చేత ఓట్లు వేయించుకున్నప్పుడు కనపడ్డ ప్రజా సమస్యలు ఎన్నికల ముగసిన తర్వాత కనపడలేదా అంటూ వేణుగోపాల్ నగర్ ప్రజలు అష్ట కష్టాలు పాలకులకు పట్టడం లేదా అంటూ ప్రశ్నించాడు. ఈ కార్యక్రమంలో జయమ్మ, చంద్రారెడ్డి, కొండారెడ్డి,హరిబాబు, శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# కర్నూలు - బల్లారి రోడ్ ఉల్లాలరోడ్ద నందు సర్కిల్ ఏర్పాటు చేయండి

## జిల్లా తెలుగుదేశంపార్టీ మాజీ ఉపాధ్యక్షులు మమ్మెల పుల్లారెడ్డి



కర్నూలు నుండి బళ్లారి- ఉల్చాలకు వెళ్లేరోడ్ (వై.జంక్షన్) ప్రస్తుతం విపరీతమైన రద్దీ కారణంగా ప్రజలకు వాహనదారుల నుండి విపరీతమైన ఇబ్బందులు ఏర్పడుచున్నవి. ఎంతో మంది ప్రమాదాలకు గురై తమ ప్రాణాలను కూడా పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇటీవల ఈ రోడ్ నందు ప్రమాదం జరిగి ఇరువురు కాళ్లు కూడా పోగొట్టుకున్నారు. ఈ అంశాన్ని గతంలో ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుడం జరిగినది.కనుక ఇక్కడ ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థము ఇక్కడ సర్కిల్ ఏర్పాటు చేయించి, సిగ్నల్స్ ను ఏరాటు చేయించి, ప్రజల ప్రాణాలను వాహభాల భారి నుండి కాపాడవలసినదిగా ఈ లేఖ ద్వారా విజ్ఞప్తిచేయుచున్నాను.

# చేసిన తప్పులను ఎదుటివారిపై రుద్దడం వైసిపి నైజం

## టిడిపి ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్ వెల్లడి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** నిన్నటి రోజు కర్నూల్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఎస్ వి మోహన్ రెడ్డి ప్రెస్ మీట్లో విలేకరులతో మాట్లాడుతూ అబద్ధాలుశ్రీ అసత్యాలు అతికినట్లు చెప్పారని వైసీపీ వారు చేసిన తప్పులను ఎదుటి వారిపై రుద్దడంలో సిద్ధహస్తులని కర్నూల్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్ ఆరోపించారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ ప్రొఫెసర్ ,మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు గారి గురించి తెలుగుదేశం పార్టీ వారు తప్పుడు ఆరోపణలు చేశారంటూ నిందలు వేయడం సరికాదని నాగేశ్వరరావు అంటే మాకు ఎంతో గౌరవం ఉందని అయితే ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షా ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ కలిసిన సందర్భంగా అమిత్ షా అనకూడని వ్యాఖ్యలను కూడా ఆపాదిస్తూ పత్రికముఖంగా మాట్లాడటాని మాత్రమే తప్పుపట్టామని ఇందులో మోహన్ రెడ్డి ఆరోపించినట్లు వారిపై గౌరవం లేకపోలేదని ఎవరిని అరెస్టు చేసే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదన్న విషయాన్ని మోహన్ రెడ్డి గ్రహిస్తే మంచిదని తెలిపారు నాగేశ్వరరావు కూడా ఎవరో చెప్పిన మాటలను తాను పొరపాట్లు మాట్లాడానని అందుకు చింతిస్తున్నట్లు కూడా నాగేశ్వరరావు వివరణ ఇచ్చుకున్న విషయాన్ని మోహన్ రెడ్డి కి తెలియక పోవడము చాలా బాధాకరమైన విషయం తెలుగుదేశం పార్టీలో ఏ ఒక్కరిపై కూడా ఎలాంటి తప్పుడు కేసులను బనయించేందుకు సాహసం చేయమని అలాంటిది మోహన్ రెడ్డి తెలుసుకోకుండా వైసిపి వారిపై అక్రమ కేసులు పెట్టేందుకు టిడిపి ప్రభుత్వం సిద్ధపడుతుందని చెప్పడంలో నిజం లేదని తెలిపారు. గతంలో వైసిపి ప్రభుత్వం హయాంలో ఏ కారణం లేకపోయినా సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి రాష్ట్రానికి సేవలు అందించినటువంటి నారా చంద్రబాబు నాయుడుపైన స్కిల్ డెవలప్మెంట్ యందు అక్రమాలు జరిగాయి అంటూ అరెస్టులు చేయించి 53 రోజులపాటు జైలులో ఉంచిన మీరు ,మా పార్టీ వారిపై ఆనాడు అచ్చం నాయుడు పైన ఈఎస్ఐ విషయంలో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ వారు ఏలాంటి ఆరోపణలు చేయకపోయినా వారిని అక్రమంగా అరెస్టు చేసి 78 రోజులపాటు జైల్లో ఉంచారు అలాగే గన్నవరం టిడిపి కార్యాలయం పై దాడి జరిగిన సందర్భంగా దాడి జరిపిన వైసీపీ వారి గురించి మాట్లాడినందుకు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పట్టాభి ని అరెస్టు చేయడానికి వెళ్లి వారి ఇంట్లో నానా బీభత్సం సృష్టించిన విషయాన్ని అరెస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు అలాగే దళితులపై వైసీపీ హయాంలో కేసులు బనాయించి నానా ఇబ్బందులకు గురి చేయడమే కాక మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్ రావు పిచ్చివానిగా మార్చి అతని చావుకు కారణమైన వైసిపి వారు అంతటితో ఆగకుండా ఈనాటి హోంమంత్రిగారైన అనిత ని మరో దళిత శాసనసభ్యులు కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీకేసు బనాయించిన విషయాన్ని గుర్తు చేశారు మీరు చేసిన పాపాలన్నింటినీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా చేస్తుందన్న నీచమైన ఆలోచనలకు దిగజారిన విషయాన్ని ఖండిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడే వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ఇప్పటికే అమలు చేసిందని తెలిపారు.గతంలో రాష్ట్రం నుండి పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లేలా చేసింది ఎవరని ప్రశ్నించారు కేవలం తెలుగుదేశం పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు అయినందువల్లనే అమర్ రాజా ఫ్యాక్టరీని రాష్ట్రం నుండి వెళ్లగొట్టారని అలాగే ఒక మాజీ పార్లమెంట్ సభ్యుడు మీ పార్టీ వారు కియా అనుబంధ సంస్థలను పక్క రాష్ట్రాలకు వెళ్లేలా చేసిన విషయాన్ని మర్చిపోయారని తెలిపారు. రాష్ట్ర మంత్రివర్యులు టీజీ భరత్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపూర్ణ సహకారంతో కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం పరిశ్రమల స్థాపన కోసం ఎనలేని కృషి చేస్తున్నారనీ ఇప్పటికే ఓర్వకల్లులో కోట్లాది రూపాయల పెట్టుబడును పెట్టి పరిశ్రమల కోసం పాటుపడుతున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు హింసించడం అత్యాచారాలు గావించడం హత్యలు చేయించడం వైసిపి వారి సంస్కృతి అని అలాంటి సంస్కృతి తెలుగుదేశం పార్టీ నాయకులకు గానీ కార్యకర్తలకు గానీ అధినేతకు గానీ లేదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఎస్ వి మోహన్ రెడ్డి ఆరోపణలు మానుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజా అభ్యుదయం కోసం ఏదైనా సలహాలు సూచనలు ఉంటే ఇవ్వాలని అనవసరమైన విమర్శలను మానుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు

# రైతుల వద్ద ఉన్న జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

## -పెరిగిన ఎరువల ధరలను తగ్గించి పాత రేట్లకి రైతులకు అందించాలి -జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రతిపాదన పూర్తి చేయాలి



**నంద్యాల ప్రతినిధి. మే 25. (నంది పత్రిక ):**రైతుల వద్ద ఉన్న జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని,పెరిగిన ఎరువల ధరలను తగ్గించి పాత రేట్లకి రైతులకు అందించాలిని ,జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రతిపాదన పూర్తి చేయాలిని ,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న,రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు. ఏ సుబ్బారెడ్డి కే భాస్కర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నాయక్ లు మాట్లాడుతూరైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీ జిల్లాలోని రైతుల, కౌలు రైతుల, ఉపాధి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.మన జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందువల్ల అవసరమైన అన్ని రకాల నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను అందుబాటులో ఉంచాలని మరియు పెరిగిన రేట్లు కాకుండా పాత ధరలకే రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను ప్రభుత్వమే రైతు సేవ కేంద్రాల ద్వారా అందించాలని, మరమ్మత్తులకు నోచుకోని అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్ల పనులను వెంటనే ప్రారంభించి మరమ్మత్తులు చేయించాలని కోరారు. అలాగే కౌలు రైతులకు అవసరమైన గుర్తింపు కార్డులను ప్రభుత్వం ముందుగానే అందజే సి, ఈ ప్రాబ్లం ఆధారంగా కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు ఎరువులు మరియు పంట రుణాలు సకాలంలో ఇవ్వాలని కోరుతున్నాము.జిల్లాలో వ్యవసాయ కూలీలతోపాటు, కౌలు రైతులు, పేద రైతులకు ఉపాధి కల్పిస్తున్నటువంటి జి రామ్ జి ఉపాధి పనులు అన్ని గ్రామాల్లో మొదలు పెట్టాలని, పని జరుగుతున్న చోట కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఫేస్ యాప్, రెండు పూటలా పని విధానం రద్దు చేయాలని, అవసరమైన అన్ని రకాల పనిముట్లను ప్రభుత్వం ఇవ్వాలని కోరుతున్నాము.రైతులు కూలీలు ప్రజలందరి పైన భారాలు పడే విధంగా కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ,గ్యాస్ మరియు ఎరువుల ధరలను తగ్గించి ప్రజలపై భారం పడకుండా చేయాలనిలేనిచో.తగ్గించేంతవరకు రైతులతో వ్యవసాయ కార్మికులతో కలిసి భారీ ఎత్తున ఆందోళన చేపడుద్దామని హెచ్చరించారు.

# పద్మశాలి విద్యార్థిని,విద్యార్థులకు ప్రతిభకు పట్టాభిషేకం పురస్కారాలు





**నంద్యాల ప్రతినిధి. మే 25. (నంది పత్రిక ):**ఉమ్మడి కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం ప్రతిభగ పట్టాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.నంద్యాల పట్టణంలోని శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి దేవాలయ కళ్యాణమండపం నందు కర్నూలు జిల్లా పద్మశాలి సంఘంఅధ్యక్షులు భీమనపల్లి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధులుగా అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు గౌరవనీయులు కందగట్ల స్వామి ఉపాధ్యక్షులు వర్ధినరసింహులు ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం గుత్తికొండ ధనుంజయ రావు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రాయలసీమ ప్రాంతీయ పద్మశాలి సంఘం అధ్యక్షులు కొంకతి లక్ష్మీనారాయణ పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా అధ్యక్షులు భీమనపల్లె వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతిభకు పట్టాభిషేకం పురస్కారాలను గత ఐదు సంవత్సరముల నుంచి అందజేస్తున్నామని తెలిపారు.పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు మరియు ఇంటర్ విద్యార్థిని విద్యార్థులకు విద్యార్థులకు మొదటి బహుమతి పదివేల రూపాయలు, రెండవ బహుమతి 7500 మూడో బహుమతి 5000 రూపాయలు మరియు కన్సోలేషన్ బహుమతులను ప్రతి విద్యార్థిని విద్యార్థులకు 2000 రూపాయలు ప్రోత్సాహక బహుమతి మరియు ప్రశంసా పత్రం మెమొంటోలు ఇవ్వడం జరిగినది. 140 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రశంసా పత్రములు ఇవ్వడం జరిగినది .శ్రీ అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

అలాగే గుత్తికొండ ధనుంజయ రావు మాట్లాడుతూ మన పద్మశాలి విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి ఐఏఎస్ లో ఐపీఎస్ లు సాధించాలని కోరారు. పద్మశాలి లందరూ రాజకీయంగా ఎదగాలని కోరారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొంకతి లక్ష్మీనారాయణ పుత్తరామకృష్ణ గాజుల శంకర్ చెన్నా వెంకటేశ్వర్లు జివి రామయ్య సప్ప మణికంఠ చెన్నా శ్రీనివాసులు గాజుల బ్రహ్మ కూడప్పుసుబ్రహ్మణ్యం శిరసాల రామచంద్రుడు కోట బాల వెంకటసుబ్బయ్య గాజుల వేణుగోపాల్ వద్దంటే వెంకట సతీష్ సింగర్ సురేష్ కోడి పరమేశ్వరుడు గాజుల పెద్ద పుల్లయ్య గుర్రం శ్రీనివాసులు మద్దాల మోహన్ కుమార గాజుల ఎర్రయ్య దోమల చక్రపాణి పల్లె ఈశ్వరయ్య చేపూరి మురళీకృష్ణ భీమర పల్లె పురంధర్ కుమార్ తాటబత్తుల సుబ్బ నరసయ్య శ్యామల సోమా బ్రహ్మానందం జోరు బండి శ్యామల గుర్రం కృష్ణవేణి కుల బాంధవులు మహిళ లు మరియు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

### సీఐ వెంకట్రామిరెడ్డి

### ఎస్ఐ నాగార్జునతో కలిసి శాంతి కమిటీ సమావేశం



**నంది పత్రిక-ప్యాపిలి** ముస్లిం సోదరులంతా రాబోయే పవిత్ర బక్రీద్ పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్యాపీలి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ప్యాపీలి సర్కిల్ కార్యాలయంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లిం పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్యాపీలి ఎస్ఐ నాగార్జునతో కలిసి సీఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ, త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగను అందరూ కలిసికట్టుగా, మతసామరస్యంతో జరుపుకోవాలన్నారు. పండుగ వేడుకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీస్ శాఖ తరపున అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు."ముస్లిం సోదరులు పండుగను ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలి. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను, వదంతులను ఎవరూ నమ్మవద్దు. ఎలాంటి సమస్యాత్మక పరిణామాలు చోటుచేసుకున్నా తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎస్ఐ నాగార్జున మాట్లాడుతూ, ఈద్గాల వద్ద ప్రార్థనల సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని, పట్టణంలో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ కూడా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్యాపీలి మండల ప్రభుత్వ ఖాజీ మహబూబ్ ఖాన్, మస్తాన్, షేక్ హుస్సేన్,నిజాముద్దీన్, కొలిమి బషీర్, కాజా, మిర్చి ఖాజా, బీరువా బాషా, మాలిక్,సుభాన్, ఖాసింవలి, జిలాన్, ఈదుర్ భాష, తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో ఘనంగా "తాలీమ్-ఎ-హునర్" టాలెంట్ టెస్ట్ ఫలితాల విడుదల

### ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్



**నంద్యాల సిటీ బ్యూరో మే 25 ( నంది పత్రిక )** నంద్యాల ఆత్మకూర్ బస్టాండ్ సమీపంలో గల ఎన్టీఆర్ షాదీ ఖానా నందు వక్ఫ్ ఎడ్యుకేషన్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "తాలీమ్-ఎ-హునర్" రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్ ఫలితాల విడుదల కార్యక్రమం సోమవారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ గారు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా నంద్యాలలో సిఈడిఎం (సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్) స్టడీ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు . ఈ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు బ్యాంకింగ్, గ్రూప్-1, గ్రూప్-2, రైల్వేస్ మరియు ఇతర పోటీ పరీక్షలకు ఉచితంగా నాణ్యమైన శిక్షణ (కోచింగ్) అందిస్తామని హామీ ఇచ్చారు.

**పరీక్షా ఫలితాల వివరాలు**రాష్ట్ర వ్యాప్తంగా ఈ టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల నుండి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 6,605 విద్యార్థులు హాజరయ్యారని అన్నారుఎంపికైన ప్రతిభావంతులు (టాప్ స్టూడెంట్స్ ): 250 (రాయలసీమ: 122, ఆంధ్రా: 127)నంద్యాల జిల్లా: 610 మంది పరీక్ష రాయగా, 21 మంది టాప్ విద్యార్థులుగా ఎంపికయ్యారని తెలిపారు

**రాష్ట్ర స్థాయి టాపర్ల వివరాలు:** బైపీసీ విభాగం: మొదటి ర్యాంక్ - షేక్ నకందర్ నయీమా సాదియా (అనంతపురం), ద్వితీయ ర్యాంక్ - షేక్ మారియా సదాఫ్ (కర్నూలు), తృతీయ ర్యాంక్ - ముల్లా అఫ్నాన్ బేగం (నంద్యాల). ఎంపీసీ విభాగం: మొదటి ర్యాంక్ - సయ్యద్ జీషాన్ అహ్మద్ (కాకినాడ), ద్వితీయ ర్యాంక్ - షేక్ నయాజ్ (శ్రీ సత్యసాయి జిల్లా), తృతీయ ర్యాంక్ - మోఘుల్ మహమ్మద్ తనీమ్ (కడప) ర్యాంకులు సాధించారని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, వక్ఫ్ బోర్డ్ సభ్యులు ఇక్రమ్ సాహెబ్, జాకీర్ సాహెబ్, ఇస్మాయిల్ బేగ్, మొకరం సాహెబ్, దూదేకుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్ , మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ సాహెబ్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్ , సీఈఓ యాకూబ్ బాషా, జిల్లా విద్యాశాఖాధికారి (డిఈఓ) జనార్ధన్ రెడ్డి, డిఎండబ్ల్యుఓ సబీహా పర్వీన్, డీఐ అస్మద్దిన్ , నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ ఇంతియాజ్ , ఆజాద్ హాఫీజ్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## రుతుపవనాల రాక ఆలస్యం.. వడగాల్పులతో తెలంగాణ విలవిల!

దేశంలోకి నైరుతి రుతుపవనాల రాక ఈసారి మరింత ఆలస్యం కానుంది. సాధారణంగా మే చివరి వారంలో ప్రవేశించాల్సిన రుతుపవనాలు, వాతావరణ మార్పుల కారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. వడగాల్పుల ప్రభావం పెరిగితే ఇది మరింత ఆలస్యం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణకు జూన్ రెండో వారం నాటికి రుతుపవనాలు ప్రవేశించే సూచనలున్నాయి. మరోవైపు, రుతుపవనాల రాక ఆలస్యమవుతుండటంతో తెలంగాణలో ఎండల తీవ్రత, వడగాల్పులు ప్రాణాలు తీస్తున్నాయి. రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల పాటు తీవ్రమైన ఎండలు కొనసాగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

# కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సిందే!



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 25:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గైర్హాజరు అవుతున్న అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సిందేనని మండల ప్రజలు కోరుకుంటున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి చాలామంది అధికారులు గైర్హాజరవుతున్నారు. కొంతమంది మండల స్థాయిఅధికారులు వేదిక కార్యక్రమానికి క్రింది స్థాయి సిబ్బందిని చేతులు దులుపుకుంటున్నారు. మండలంలో కొందరు అధికారుల పనితీరు సరిగా లేదని జిల్లా కలెక్టర్ చేత ఎన్నో మార్లు చీవాట్లు తిన్నారు. అయినప్పటికీ అధికారులలో ఎటువంటి మార్పు కనపడటం లేదు. చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని వారాలుగా అధికారుల పనితీరులో ఎటువంటి మార్పు రాలేదు సరి కదా, మాకేమిటి అంటూ నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై సత్వరమే పరిష్కరించడంలో చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ, కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. సోమవారం నాడు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఉదయం 9:30 కి మండల తాసిల్దార్ పద్మావతమ్మ, డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తం మాత్రమే సకాలంలో హాజరయ్యారు. మిగిలిన అధికారులందరూ 10 గంటలు దాటిన పీజిఆర్ఎస్ కార్యక్రమంలో పాలుపంచుకోలేదు. ఈ కార్యక్రమం పై అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇదే విధంగా ఉంటే, రాను రాను ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అభాసు పాలయ్యే పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. ఈనెల 19న గిరిజన ప్రాంతాలలో జన్మభూమి దారి కార్యక్రమానికి కూడా క్రింది స్థాయి అధికారులు పాల్గొనడం కొ సమెరుపు.

## బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

### మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు



**మంత్రాలయం , మే 25,మనం న్యూస్ ;-** బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు సూచించారు. సోమవారం మండల పరిధిలోని వగరూర్ గ్రామంలో ఉన్న సచివాలయంలో హిందూ ముస్లిం పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండగను ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మత సామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవంతో వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ మరియు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## భూ సమస్యలు లేకుండా చూడాలి

### - తహసిల్దార్ ఉమారాణి

**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని ఏగ్రామంలో కూడా రైతులకు ఎటువంటి భూ సమస్యలు లేకుండా చూడాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రైతులనుంచి 4 ధరఖాస్తులు భూములను రీ సర్వే చేయించాలని వచ్చాయని తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు సూచించామని తహసీల్దార్ వెల్లడించారు.

## విద్యార్థులకు బహుమతులతో బడి పండుగ వేడుకలు



**కాశినాయన మే 25 (నంది పత్రిక ):**కాశినాయన మండలం నరసాపురం తెలుగు పాఠశాలలో సోమవారం బడి పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, విద్యా ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, ఐ సి డి ఎస్ అధికారులు, డి డబ్ల్యూ ఎం ఏ , ఎం ఈ పి ఎం ఏ సిబ్బంది, మండల విద్యాశాఖాధికారి మహమ్మద్ షఫీ, నిర్మల, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఎం ఆర్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో ఉన్న వసతులు, విద్యా ప్రమాణాల గురించి తల్లిదండ్రులకు వివరించి అవగాహన కల్పించారు. మండల సమాఖ్య సమావేశంలో ప్రభుత్వ బడి ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అధికారులు కోరారు. అలాగే నరసాపురం తెలుగు మరియు ఉర్దూ పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసి 6వ తరగతికి వెళ్లనున్న విద్యార్థులను మండల విద్యాధికారులు అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల ప్రాధాన్యతను వివరించారు.



## యాళ్లూరులో ప్రతిష్టాత్మక ఎం.ఎస్.ఎం.ఇ పార్కుకు శంకుస్థాపన చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల సిటీ బ్యూరో గోస్పాడు మే 25 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎం.ఎస్.ఎం.ఇ పార్కు" (రాష్ట్రవ్యాప్తంగా 175 ఎం.ఎస్.ఎం.ఇ ఇండస్ట్రియల్ పార్కులు) మరియు "ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త" పథకంలో భాగంగా, నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో రూ. 16.40 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన ఎం.ఎస్.ఎం.ఇ పార్కుకు సోమవారం రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. స్థానిక యువతకు సొంత గ్రామాల పరిసరాల్లోనే ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే కాకుండా, ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన అత్యంత వేగంగా పూర్తి చేసి, త్వరలోనే పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ప్లాట్లను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఎం.ఎస్.ఎం.ఇ పార్కుల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని, యాళ్లూరు పార్కుకు సంబంధించి 9 ఎకరాల భూమి ఇప్పటికే ఏపీఐఐసీ ఆధీనంలో ఉందని తెలిపారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా మౌలిక వసతుల కల్పనను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**నంద్యాల జిల్లా నియోజకవర్గాల వారీగా ఎం.ఎస్.ఎం.ఇ పార్కుల వివరాలు:**

1. నందికొట్కూరు నియోజకవర్గం: తంగడంచ గ్రామం (జూపాడు బంగ్లా మండలం) - 50.00 ఎకరాలు (241 ప్లాట్లు)2. డోన్ నియోజకవర్గం: జగదుర్తి గ్రామం (డోన్ మండలం) - 36.09 ఎకరాలు (38 ప్లాట్లు)3. బనగానపల్లె నియోజకవర్గం: ఇటిక్యాల గ్రామం (కొలిమిగుండ్ల మండలం) - 59.97 ఎకరాలు (266 ప్లాట్లు - 23 కేటాయించబడ్డాయి) 4. ఆళ్లగడ్డ నియోజకవర్గం: ఆర్. కృష్ణాపురం గ్రామం (ఆళ్లగడ్డ మండలం) - 44.04 ఎకరాలు (228 ప్లాట్లు)ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలికినట్లయిందని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, యాలూరు సొసైటీ చైర్మన్ గంగు వెంకటరెడ్డి, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , గోస్పాడు మండల కన్వీనర్ తులసిశ్వర్ రెడ్డి, వంటివెలగల భాస్కర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి , హుస్సేన్, బాలిశ్వర్ రెడ్డి , మనోజ్ , ఏపీఐఐసీ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.




## జొన్న రైతులకు అండగా వైసీపీ యువజన విభాగం తరపున నాలుగవ రోజు అన్నదాన కార్యక్రమం



**నంద్యాల సిటీ బ్యూరో మే 25 ( నంది పత్రిక )** నంద్యాలలో నాలుగు రోజులగా స్థానిక గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్న జొన్న రైతులకు వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా వైసీపీ ట్రెజరర్ మదన్మోహన్ రెడ్డి భోజనాల వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ పార్లమెంట్ సెక్రటరీ మరియు నంద్యాల నియోజకవర్గ పరిశీలకుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, నంద్యాల జిల్లా వైసీపీ ట్రెజరర్ మదన్మోహన్ రెడ్డి, పాణ్యం మండలం వైసీపీ యూత్ ప్రెసిడెంట్ సద్దల సుజిత్ రెడ్డి , జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ నాగేంద్ర , జనార్ధన్, చోటు, రమేష్ ....

## లింగ నిర్ధారణ చట్ట రిత్య నేరము బద్వేల్ డివిజన్ రెవెన్యూ అధికారి చంద్రమోహన్

**బద్వేల్, మే 25( నంది పత్రిక ):**బద్వేల్ రెవిన్యూ డివిజన్ కార్యాలయం నందు రెవెన్యూ డివిజనల్ అధికారి హచ్ చంద్ర మోహన్ మరియు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి. రాజేంద్ర ప్రసాద్ వారి ఆదేశాల మేరకు సబ్ డిస్ట్రిక్ మల్టీ మెంబర్స్ అథార్టీ కమిటీ సమావేశం ఏర్పాటు ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాడుమైంది. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ చంద్రమోహన్ గారు మాట్లాడుతూ ప్రైవేటు మరియు గవర్నమెంట్ హాస్పిటల్ నందు స్కాన్ సెంటర్ నందు లింగ నిర్ధారణ జరగకూడదు అటు జరిపిన వారి పైన కఠిన చర్యలు తీసుకునిబడును రెవెన్యూ డివిజన్ అధికారి తెలియజేయడమైనది,సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ జి.రాజేంద్ర ప్రసాద్ గారి మాట్లాడుతూ మగ ఆడ అన్ని స్కానింగ్ సెంటర్లో తెలియజేస్తుంటే అటువంటి ఆస్పత్రులు మాకు తెలియజేస్తే డిపార్ట్మెంట్ పూర్తి సహకారం అందించడం జరుగునని తెలియజేయడమైనది ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. మల్లేష్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ బద్వేల్ శ్రీదేవి, డాక్టర్ శరత్చంద్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య హెల్త్ సూపర్వైజర్ శివరాంరెడ్డి వెంకటేశ్వర్లు హెల్త్ అసిస్టెంట్ వి.జనార్దన్ రావు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# జనాభా నమోదు ప్రక్రియను 31వ తేదీలోపు పూర్తి చేయాలి

## నిర్దేశించిన సమయంలోపు గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి
## ఇంప్రాపర్ రెడ్రెస్సల్, బియాండ్ ఎస్.ఎల్.ఏ శాతం తగ్గించే విధంగా చర్యలు చేపట్టండి
## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....**జనాభా నమోదు ప్రక్రియను మే 31వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి సెన్సస్, హౌసింగ్, పిజిఆర్ఎస్, జలధార - జలహారతి తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెన్సస్ కి సంబంధించి రాష్ట్రంలో జనాభా నమోదు ప్రక్రియలో మంచి పురోగతి సాధించినప్పటికీ, డోర్ లాక్డ్, ఖాళీ ఇళ్లు మరియు ఇన్స్టిట్యూషనల్ వివరాల నమోదు సరిగా జరగడం లేదన్నారు. ఈ ప్రక్రియను 31వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ తహశీల్దార్లను, మున్సిపల్ కమిషనర్లను, ఎంపిడిఓ లను ఆదేశించారు. తాళం వేసిన ఇళ్లలో నివసించే వారి వివరాలను ఎన్యూమరేటర్ లు పొరుగువారి ద్వారా ఫోన్ నంబర్లను సేకరించి తద్వారా వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మిగితా మండలాలు పురోగతి సాధిస్తున్నప్పటికీ, ఆదోని లాంటి మండలాలు పురోగతి సాధించడంలో వెనుకబడి ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రస్తుతం సగటు నమోదు శాతం 92కు చేరుకుందని, అయితే 80 శాతం కంటే తక్కువ నమోదుతో ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన మండలాలపై 3, 4 రోజులు ప్రత్యేక ఫోకస్ పెట్టి పని చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చున్నారు. ఆదోని మున్సిపాలిటీలో నమోదు శాతం 78.7 మాత్రమే ఉండగా, అది జిల్లా సగటుతో పోలిస్తే దాదాపు 10 శాతం తక్కువగా ఉందన్నారు. పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్రతి కుటుంబాన్ని నమోదు ప్రక్రియలో భాగస్వామ్యం చేసే వరకు క్షేత్రస్థాయిలో మరింత శ్రద్ధగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పిజిఆర్ఎస్ కి సంబంధించి ఇంప్రాపర్ రెడ్రెస్సల్ 9 శాతం, బియాండ్ ఎస్.ఎల్.ఏ (రూూూ) కూడా 9 శాతం ఉండేదన్నారు. మే నెలలో ఇంప్రాపర్ రెడ్రెస్సల్ పర్సంటేజ్ 11% కి పెరిగిందన్నారు. ఇంప్రాపర్ రెడ్రెస్సల్ శాతం, బియాండ్ ఎస్.ఎల్.ఏ శాతం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



సర్వే కి వెళ్ళే సమయంలో ముందస్తు నోటీస్ లను వారం రోజుల ముందే ప్రజలకు ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక రోజు ముందు నోటీస్ ఇవ్వడం లాంటివి చేయకూడదన్నారు. ఇంప్రాపర్ రెడ్రెస్సల్ 11 శాతానికి పెరగడానికి కారణం ఎవరనే లిస్ట్ తీసుకొని వారికి షోకాజ్ నోటీస్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ-వెహికల్స్ (ఎలక్ట్రానిక్ వెహికల్స్) కి షిఫ్ట్ అవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఎక్కువ శాతం వీలైనంత వరకు నెల రోజుల లోపు ఎలక్ట్రానిక్ వెహికల్స్ కు షిఫ్ట్ అవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మరి ముఖ్యంగా హైర్డ్ వెహికల్స్ (అద్దె వాహనాలు) వాడుతున్న శాఖల వారు ఎలక్ట్రానిక్ వెహికల్స్ కు మారాలన్నారు. ఎలక్ట్రానిక్ వెహికల్స్ కు మారడం ద్వారా పర్యావరణం ను కాపాడడంతో పాటు, పెట్రోల్ వాడకం తగ్గించే అవకాశం ఉంటుందన్నారు.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కి సంబంధించి జూన్ 5 నుంచి జూన్ 14 వరకు శిక్షణ కార్యక్రమాలు, ముద్రణ ప్రక్రియలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి ధృవీకరణ చేపట్టనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. జూలై 14 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయాలని, జూలై 21 నాటికి ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురణ జరగనుందని కలెక్టర్ వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్స్, ఫారమ్‌లను పూర్తిగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రతి బి ఎల్ ఓ కి మ్యాపింగ్ పూర్తయినట్లు ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. తహసీల్దార్, కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, జు=రా మరియు ఐజుూ కార్యాలయాల్లో కూడా ప్రజలకు సహాయ కేంద్రాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే సమర్పించగా, ఇంకా ఏవైనా పెండింగ్ అంశాలు ఉంటే వాటిని పరిశీలించి ధృవీకరించి వెంటనే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. మ్యాపింగ్ సర్టిఫికేట్లు అత్యంత ముఖ్యమని, అన్ని జు=రాలు, ూజు=రాలు మండలాల వారీగా సమీక్షించి ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.. ప్రతి పోలింగ్ కేంద్రానికి తప్పనిసరిగా ఒక దూూ ఉండాలని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1200 మందికి మించిన ఓటర్లు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్ల దూరం, కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చే పరిస్థితులు, ఓటర్లకు ఇబ్బందులు కలిగించే అంశాలపై ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, గత వారం నుంచి ఇప్పటి వరకు కేవలం 54 గృహాలు మాత్రమే ఆర్.ఎల్ నుంచి ఆర్.సి స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. ఆదోని రూరల్, చిప్పగిరి, సి.బెలగల్, గూడూరు, కౌతాలం, ఓర్వకల్లు, గోనెగండ్ల మండలాల్లో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. ఈ మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కర్నూలు అర్బన్, ఆదోని అర్బన్, ఎమ్మిగనూరు అర్బన్ ప్రాంతాల్లో కొంతమేర పురోగతి కనిపించిందని, నిర్దేశించిన గడువులోపు నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు.జలధార జలహారతి పనులకు సంబంధించి వాహనాలు ఒక్క రోజు కూడా ఖాళీగా ఉంచకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ (వీ×) ట్యాంకుల పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేసి, రానున్న వర్షాకాలానికి అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నీటితో నిండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు .. పనుల కోసం వినియోగిస్తున్న వాహనాలు మరియు యంత్రాలు నిరుపయోగంగా ఉండకుండా సమర్థవంతంగా ఉపయోగించాలన్నారు. వాటిని నిరుపయోగంగా ఉంచితే సంబంధిత అధికారుల మీద కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న 35 క్యాస్కేడ్స్ దగ్గర రేపటి నుంచి హిటాచీ, జేసిబి వాహనాలను పెట్టాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డి ఆర్ ఓ సి. వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ రమణ రెడ్డి, సిపిఓ భారతి, డిఎస్ఓ రాజా రఘువీర్, తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ ను పవిత్రంగా పాటించాలి...
## ఖతీబ్ అబ్దుల్ మజీద్ ఆరిఫ్



**చాగలమర్రి మే 25నంది పత్రిక** బక్రీద్ పండుగను పవిత్రంగా పాటిస్తూ శాంతియుతంగా జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్ ఖతీబ్ అబ్దుల్ మజీద్ ఆరిఫ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బక్రీదు పండుగ అనేది త్యాగం సమర్పణ కలిగి ఇతరులకు దేవుని ప్రేమను కనుపరచాలన్నారు. బక్రీదు పండుగ సందర్భంగా ఆవులను బలి ఇవ్వకూడదు అన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా గొర్రె మేక, తదితర చిన్న జంతువులను ఖుర్బాని ఇవ్వాలన్నారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ ముస్లిం అన్యోన్యతను దెబ్బ తినకుండా పరస్పర గౌరవంతో పొరుగు వారి భావాలను గౌరవించాలన్నారు. అవును జాతీయ జంతువుగా ప్రకటించాలని విజ్ఞప్తిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాలని తాము కూడా మద్దతు తెలియజేస్తున్నామన్నారు. దేశంలో ఐక్యత, జాతీయ సమగ్రత బలోపేతం చేయడానికి సమిష్టి కృషి అవసరం అన్నారు. దైవ భీతి, విధేయత, శాంతి స్థాపన కుర్బానీ యొక్క అసలు ఉద్దేశం అన్నారు. ఇబ్రహీం తన కుమారుని దేవునికి కుర్బానీ ఇవ్వడానికి వెనుకాడ లేదని ఇబ్రహీం యొక్క విధేయతను మెచ్చి యెహోవా దేవుడే కుర్బానీ పొట్టేలుగా వచ్చి త్యాగం చేశాడన్నారు.

# కామ్రేడ్ పి వెంకటయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి.



**బేతంచెర్ల మే 25 నందిపత్రిక ).** బేతంచర్ల లారీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) వ్యవస్థాపకులు యూనియన్ ప్రథమ కార్యదర్శి కామ్రేడ్ పి. వెంకటయ్య ఆశయ సాధనకు ప్రతి నాయకుడు, కార్మికుడు కృషి చేయాలని, బేతంచెర్ల లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై ఎల్లయ్య, బి. రామాంజనేయులు అన్నారు. బేతంచర్ల లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కామ్రేడ్ పి. వెంకటయ్య 29వ వర్ధంతి సందర్భంగా వెంకటయ్య చిత్ర పటానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎస్.ఖాజా బాష,వై. ఎల్లయ్య రామాంజ నేయులు,రామళ్లకోట మద్దయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాల క్రితం బేతంచెర్ల పట్టణంలో కార్మికులు, యజమానుల ఆగడాలకు, దౌర్జన్యాలకు, బలైపోతున్న పరిస్థితిని చూసి,చలించిపోయి బేతంచెర్ల మండలం కేంద్రంలో బేతంచెర్ల లారీ వర్కర్స్ యూనియన్ ను కామ్రేడ్ పి వెంకటయ్య ఏర్పాటు చేయడం జరిగిందని వారన్నారు. వృత్తిపరంగా రిటైర్డ్ ఆర్మీ లో విధులు నిర్వహించి, కార్మికుల ఇబ్బందులు చూసి సంఘం ఏర్పాటు చేయాలని ఆలోచన చేసిన మహోన్నత వ్యక్తి అని వారు కొనియాడారు. ఈనాడు మండలంలో సిఐటీయు ఎర్రజెండా రెపరెపలాడుతుందంటే,కామ్రేడ్ పి. వెంకటయ్య చేసిన కృషి ఫలితమే అని వారన్నారు. ఈనాడు బేతంచెర్ల మండలంలో లారీ, ఆటో, భవన నిర్మాణ కార్మిక సంఘం, అంగన్వాడి, ఆశ, హమాలి తదితర కార్మికులతో కలిసి 18 కార్మిక సంఘాలు ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపుగా 5 వేలకు పైగా సభ్యత్వం ఉందంటే వెంకటయ్య విశేష కృషి ఫలితమే అని అన్నారు. కనుక భవిష్యత్తులో కామ్రేడ్ పి. వెంకటయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు అహర్నిశలు కృషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మహేశ్వర్ రెడ్డి, పెద్దయ్య, రామళ్ల కోట భాష, రాజు, జలంధర్, టింగు, నాగరాజు, ధనుంజయుడు, వెంకటేశ్వర్లు పాపారాయుడు, మధు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ గా మారిన ఏకలవ్య నగర్..



**నంది పత్రిక ఆత్మకూరు.....** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మున్సిపాలిటీలోని ఏకలవ్య నగర్ లో నాగశెట్టి బంకు పక్కన. చెత్త పేరుకుపోయింది మొరిగిపోయిన అన్నం దుర్వాసన గలిగే చారు,ఇతర గలీజు నీళ్లు పోసి, చెత్తంతా రోడ్డుపై వేస్తున్నడంతో. అటు నిత్యం సాయిబాబా టెంపుల్ కు పోయే భక్తులు, ఇటు గౌతం స్కూలుకు పోయే చిన్నపిల్లలు. అక్కడ నిత్యం సంచరించే జనాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కానీ మున్సిపల్ అధికారులు ఇంతవరకు ఎలాంటి స్పందన లేదు, దాదాపు ఐదు రోజుల నుండి మురికి పోయి దుర్వాసనతో అనేక రోగాలతో ప్రజలు బాధపడుతున్న పట్టించుకోని మున్సిపల్ కమిషనర్,దీనిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉన్నతమైన అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుంది అని అక్కడున్న ప్రజలు చర్చించుకుంటున్నారు.

# దేవాలయ భూములు కౌలుకు వేలం

**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 25:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న వివిధ దేవాలయాలకు సంబంధించి న భూములను ఒక ఏడాది నిమిత్తమై కౌలుకు వేసుకునేందుకుగాను సోమవారం వేలంపాటలను నిర్వహించారు. ఈర్నపాడు గ్రామంలోని శ్రీ చెన్నకేశవ ఈశ్వర కోదండ రామస్వామి దేవస్థానంల కు సంబంధించి 47.23 ఎకరాల భూమికి వేలంపాటలు నిర్వహించారు. ఈ ఏడాది వేలం పాటల్లో పది లక్షల 7300 రూపాయల ఆదాయం వచ్చింది. గత సంవత్సరం తొమ్మిది లక్షల 57,600 రూపాయలు వచ్చింది. లక్ష 7వేల 300 రూపాయలు ఆదాయం వచ్చింది. బి కోడూరు గ్రామంలోని చెన్నకేశవ దేవస్థానం కు సంబంధించి 21.53 ఎకరాల భూమిని వేలం వేశారు. ప్రస్తుతం వేలంపాటల్లో ఆరు లక్షల 41 వేల రూపాయలు రాగా గత సంవత్సరం ఐదు లక్షల 90 వేల రూపాయలు వచ్చింది. ఈ ఏడాది 51 వేల రూపాయల ఆదాయం వచ్చింది. ఓంకార సిద్దేశ్వర స్వామి దేవస్థానం కు సంబంధించిన 2.50 ఎకరాలు భూమిని వేలం వేశారు. ప్రస్తుతం 97, వేల ఆదాయం రాగా, గత సంవత్సరం 96,000 వచ్చిందని, ఇక్కడ వెయ్యి రూపాయల ఆదాయం మాత్రం లభించింది. ఈ వేలంపాట కార్యక్రమాలలో దేవస్థానముల పర్యవేక్షణాధికారి, వెలుగోడు గ్రూపు దేవస్థానంల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనార్ధన్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్, ఈర్నపాడు దేవస్థానం చైర్మన్ చిన్న కాశన్న, ధర్మకర్తల మండలి సభ్యులు సిద్ధం ప్రతాపరెడ్డి, బండి శ్రీనివాసులు, అన్నెం శంకర్ రెడ్డి, దేవస్థానం అర్చకులు పోలీస్ సిబ్బంది గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు. బి కోడూరు దేవస్థానం కు సంబంధించి చైర్మన్ ఉదయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొండమాల చలమయ్య,ఓంకారం సిద్దేశ్వర స్వామి దేవస్థానం కు సంబంధించి చైర్మన్ అల్లే చెన్నారెడ్డి,



# రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు సబ్సిడీకి ఇవ్వాలి బ్యాంకు లందు రైతులకు మరియుకౌ లు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి :: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూల్ సి ఆర్ భవన్ నందు రైతు సంఘం జిల్లా కౌన్సిల్ విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి. ముఖ్య ఆహ్వానితులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి రామచంద్రయ్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన గౌడ్ హాజరు కావడం జరిగింది ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి రామచంద్రయ్య రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది కావున రైతులందరికీ సకాలంలో నాణ్యమైన విత్తనాలు 90% సబ్సిడీకి ఇవ్వాలని మరియు ఎరువులు పురుగుమందులు బ్యాంకులందు పంట రుణాలు రైతులకు కౌలు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు జిల్లాలో చాలా ప్రాంతాలలో ఎరువులు షాపులందు నాణ్యతలేని ఎరువులు నాణ్యతలేని విత్తనాలు బహిరంగంగా అమ్ముతున్న వ్యవసాయ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం తగదు అని వారు తెలిపారు ఇప్పటికైనా ఎక్కడైతే నాణ్యతలేని విత్తనాలు నాణ్యత లేని ఎరువులు అమ్ముతున్న షాపుల మీద షాపుల యాజమాన్యం మీద క్రిమినల్ కేసులు బనాయించి చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులకు డిమాండ్ చేశారు అదేవిధంగా ప్రభుత్వం రెవెన్యూ అధికారులు వ్యవసాయ అధికారులు సమన్వయంతో గ్రామాలలో సభలు నిర్వహించి భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలి అదే విధంగా గుర్తింపు కార్డులు ఉన్న రైతులందరికీ పంట రుణాలు అన్నదాత సుఖీభవ పథకం సబ్సిడీ ఎరువులు విత్తనాలు ఇవ్వాలని వారు తెలిపారు ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పంపన గౌడ్ కూడా మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు ఆర్డీఎస్ గుండ్రేవుల వేదవతి ప్రాజెక్టు నిర్మాణపు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే దానికి పూనుకోవాలని రైతులందరికీ సకాలంలో నాణ్యమైన ఎరువులు విత్తనాలు 90% సబ్సిడీ కె ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో దాదాపు 40 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు ఈ సమావేశంలో రైతులందరికీ 90 శాతం సబ్సిడీకే ఎరువులు విత్తనాలు ఇవ్వాలి మరియు రైతులందరికీ కూటమి ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకాన్ని 20000 నుండి 50000 రూపాయలు పెంచాలి అదేవిధంగా రైతులు కౌలు రైతులకు ఉచిత పంటల బీమాను ఇవ్వాలి అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా రైతులందరికీ బ్యాంకు లందుతీసుకున్న రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేయాలి అదేవిధంగా జిల్లాలో ని గ్రామ సచివాలయంలో అన్ని రకాల పంటల నాణ్యమైన విత్తనాలను నాణ్యమైన ఎరువులను అందుబాటులో ఉంచాలి ఈ డిమాండ్ల సాధన కోసం జూన్ 1 అన్ని మండల కార్యాల దగ్గర ధర్నాలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపునిచ్చింది కావున జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం శ్రేణులు ధర్నాలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో పత్తికొండ రైతు సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు ఉమాపతి సురేంద్ర కుమార్ ఏపీ చేతివృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు చదువుల కాశి మద్దిలేటి నాయుడు వాల్మీకి రాముడు డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి చింతల మహేష్ రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు బసాపురం గోపాల్ పరమేశ్వర్ రెడ్డి మబ్బు ఆంజనేయ రైతు నాయకులు సుంకన్న భాష బి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.




# ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు.

**రుద్రవరం ప్రతినిధి మే 25 (నంది పత్రిక):** మండల వ్యవసాయ అధికారి జి సుమతి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం మండలంలోనికోటకొండ గ్రామంలో ఖరీఫ్ సీజన్ లో ఎల్ నీనో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉన్నందువలన రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని డాక్టర్ సహదేవరెడ్డి ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆర్ ఏ ఆర్ ఎస్ మార్టేరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్ లో వర్షాలు తక్కువగా ఉండడం వలన వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి బెట్టను తట్టుకోగల పంటలైన ఆపరాలు పప్పు దినుసులు పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వరి సాగు చేసే రైతులు ముందుగా జీలుగా జనము లేదా పిల్ల పెసర పిఎండిఎస్ కిట్లను భూమిలో వేసి కలదున్ని భూసారాన్ని పెంచుకోవాలని తెలిపారు. వరిలో విచక్షణారహితంగా ఎరువులు వాడకం తగ్గించి తగు మోతాదులో ఎరువుల యాజమాన్యం చేపట్టినట్లయితే తక్కువ ఖర్చుతో అదిక ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలిపారు.అలాగే తెజెస్వర్ రావు శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు సంఘటితంగా ఏర్పడి వ్యవసాయం చేయడం వలన మార్కెట్ ధరలను సొంతంగా నిర్ణయించుకొని మంచి లాభాలు పొందవచ్చు అని తెలిపారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ మంజునాథ్ ఆర్ ఎ ఆర్ఎస్ నంద్యాల మాట్లాడుతూ వివిధ రకాల పంటలలో వచ్చే చీడపీడల యాజమాన్యం వాటి పైన నివారణ చర్యల గురించి రైతులకు వివరించడం జరిగినది. రైతులు తప్పనిసరిగా డ్రోన్ సేవలు వినియోగించుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల బృందం సమన్వయ కర్త డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన వెంటనే మేలైన విత్తన ఎంపిక ముఖ్యమని విత్తనం మంచిదైతే పంట దిగుబడులు బాగుంటాయని రైతులకు తెలిపారు.జిల్లా వనరుల కేంద్రం నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చెన్నయ్య మాట్లాడుతూ గతంలో వ్యవసాయం ఇప్పటికీ జరుగుతున్న వ్యవసాయం గురించి వాటి తారతమ్యాలు పంట మార్పిడి వంటి వాటిపై రైతులకు సలహాలు సూచనలు అందించడం జరిగినది. రైతులు మొక్కజొన్న బదులు సొయా చిక్కుడు ఆముదం వంటి పంటలను వేసుకోవాలని సూచించారు .జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర పంటల యాజమాన్యం రైతులు వ్యవసాయం మీదనే ఆధారపడకుండా పసు పోషణ కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉమాదేవి గ్రామ పెద్దలు జంగిటి రాజు, వెంకటపతి గ్రామ రైతులు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# పెరిగిన ఇంధన, ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలి

**వ్యవసాయ సంక్షోభాన్ని మరింత పెంచుతున్న ధరల పెంపు**

**ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం**

**పత్తికొండ నియోజకవర్గ ఇంచార్జి మరియు డిసిసి అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ ఆధ్వర్యంలో పెరిగిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ మరియు ఎరువుల ధరలను తగ్గించాలని కోరుతూ పత్తికొండ ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ కి గ్రీవెన్స్ డే సందర్భంగా వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఎరువుల ధరలను ఒక్కో బస్తాపై రూ.300 నుండి 400 వరకు పెంచడం రైతులపై మరింత భారం మోపుతున్నదన్నారు. పెరిగిన ఇంధన మరియు గ్యాస్ ధరల కారణంగా రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజల జీవనం కష్టమైందన్నారు. దేశంలో 55 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ రైతుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించి రైతులు, సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

అలాగే దేవనకొండ మండలం పొట్లపాడు గ్రామంలో 200 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం మొదలు పెట్టాలి అని మంత్రాలయం, ఎమ్మిగనూరు కు పత్తికొండ, దేవనకొండ మరియు 20కి పైగా గ్రామాల ప్రజలకు, రైతులకు ఉపయోగపడుతుంది అని గ్రీవెన్స్ లో నమోదు చేయడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, ఖాసీం, షేక్షావలి, మొహమ్మద్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన ధరలతో పేదల నడ్డి విరుస్తున్న కేంద్రం ::

**కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కేంద్ర ప్రభుత్వం ఓవైపు పెట్రోల్ డీజిల్ మరోవైపు వంట గ్యాస్ ఎరువు ధరలను పెంచుతూ ఇటు ప్రజలను అటు రైతులను కేంద్ర ప్రభుత్వం నడ్డి విరుస్తుందని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలతఆరోపించారు. సోమవారం కర్నూల్ నగరంలోని ఆర్డీవోని కలసి పెట్రోల్ డీజిల్ గ్యాస్ ఎరువులు ధరలు తగ్గించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు మహిళా జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ సామాన్య ప్రజలతో పాటు రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొంటున్నారని, పెరిగిన ఎరువుల ధరలతో గిట్టుబాటు ధర రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ఎరువు బొగ్గు ధరలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కొత్తూరు సుబ్బరాయునిలో జడ్జీలు ప్రత్యేక పూజలు..!



**పాణ్యం ప్రతినిధి. నంది పత్రిక. మే 25.** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు కర్నూలు సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి, చిత్తూరు జిల్లా వాయల్పాడు జూనియర్ సివిల్ జడ్జ్ అరవింద్ సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల నారాయణశర్మ, పాణ్యం ఏఎస్ఐ రఫీ, ఆలయ మర్యాదతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు న్యాయ నిర్ణేతలకు పూలమాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు క్రిష్ణయ్య స్వామి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# గడ్డి మందు తాగి వివాహిత మృతి



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 25** : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాల్వ గ్రామానికి చెందిన తలారి మహేశ్వరి(32) అనే వివాహిత మహిళ గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు తెలిపారు. శనివారం నాడు మహేశ్వరి గడ్డి మందు తాగిందని, ఆమెను వెంటనే చికిత్స నిమిత్తము నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహేశ్వరి కో లుకోలేక సోమవారం మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. మహేశ్వరికి ఇరువురు ఆడపిల్లలు సంతానం కాగా, ఉపాధి పనుల్లో పాలుపంచుకుంటూ ఉండేదని, మహేశ్వరిమృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. కుటుంబ కలహాల కారణంగానే మహేశ్వరి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

## ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ( ఆప్టా) కర్నూలు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** సోమవారం ఉదయం ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) జిల్లా కార్యాలయం లో 2026-2028 సంవత్సరం నకు గాను ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కర్నూలు జిల్లా కార్యవర్గ ఎన్నికలునిర్వహించబడ్డాయి. కర్నూలు జిల్లా ఎన్నికల అధికారిగా రాష్ట్ర నాయకుడు బండారు శంకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు హాజరు అయ్యారు. ఈ ఎన్నికల లో కర్నూలు జిల్లా లోని అన్ని మండలాల అప్టా సభ్యులు పాల్గొనడం జరిగింది. కర్నూలు జిల్లా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కర్నూలు జిల్లా ఆప్టా అధ్యక్షుడు గా ఎం మధుసూదన్ రెడ్డి ( కోడుమూరు), జిల్లా ప్రధాన కార్యదర్శిగా డి గోపాల్ (కర్నూలు), అర్థిక కార్యదర్శి గా ఎన్ బి వినోద్ కుమార్ (ఆస్పరి), అసోసియేట్ ప్రెసిడెంట్ గా లక్ష్మా నాయక్ (కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్),ఉపాధ్యక్షులు గా ఎస్ . ప్రసాద్ (కోడుమూరు), జి. లక్ష్మన్న (సి. బెలగళ్), బషీర్ (కృష్ణగిరి), పద్మావతి (కర్నూలు) కార్యదర్శి లు గా హైమావతి (కోసిగి), చిన్న మూర్తుజ వలి (ఆలూరు) నవీన్ రెడ్డి ( కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్), ఆర్గనైజింగ్ సెక్రటరీ లు గా శివశంకర్ (నందవరం),సుంకన్న ( పెద్ద కడుబూరు), సానియా బేగం (ఆదోని), ఖాదర్ వలి (గూడూరు) అడిషనల్ జనరల్ సెక్రటరీ గా జె సుధారాణి (దేవనకొండ) స్టేట్ కౌన్సిలర్ గా కె ప్రకాష్ రావు (దేవనకొండ), మహమ్మద్ ఖదీరుల్లా (గూడూరు), విజయ భాస్కర్ (గోనెగండ్ల), మధుసూదన్ రెడ్డి (సి.బెళగల్) ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బండారు శంకర్ మాట్లాడుతూ రాష్ట్రం లో సమర్థవంతమైన నాయకత్వం తో ఉపాధ్యాయ సంఘాల యందు ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) శరవేగం తో ముందుకు వెళుతుందని, కొత్తగా ఎన్నిక అయిన కార్యవర్గం సమన్వయం తో జిల్లా యందు అప్టా ను అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో అప్టా సభ్యులు చురుకుగా ఉపాధ్యాయులకు సర్వీస్ చేస్తున్నారు అని అందువలన అప్టా సభ్యులు పెరుగుతున్నారు, ఈ సంవత్సరం కర్నూలు జిల్లాలో అప్టా సభ్యత్వం కార్యక్రమం చాలా బాగుగా జరిగిందని చెప్పారు. పి ఆర్ సి కమిటీ కి చైర్మన్ వెంటనే నియమించాలి ఐ ఆర్ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం నకు ప్రాతినిధ్యం చేయాలి అని జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేయడం తో సమావేశం ముగిసింది.

# అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి



**బనగానపల్లె మే 25నందిపత్రిక** ప్రజల సౌకర్యార్థము నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను సోమవారం మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి పరిశీలించారు. ముందుగా బనగానపల్లె పట్టణంలో మైనార్టీ సోదరుల కోసం నూతనంగా నిర్మిస్తున్న షాది ఖానా నిర్మాణ పనులను పరిశీలించారు షాది ఖానా నిర్మాణ పనులు పూర్తయి తుది మెరుగులు దిద్దుకుంటున్న క్రమంలో అక్కడి మేస్త్రీలకు పలు సూచనలు చేశారు. అవుకుమెట్ట ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు తహసీల్దార్ (ప్రస్తుత ఆర్టీవో) కార్యాలయం పునరుద్ధరణ పనులు,బనగానపల్లెలోని కొండపేట శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులు బనగానపల్లె బైపాస్ నిర్మాణ పనులను పరిశీలించి పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలెనని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.





## నల్లమలలో రైలు ఢీకొని పెద్దపులి మృతి



**మహానంది, మే 25 (నంది పత్రిక):-** నల్లమలలో గూడ్స్ రైలు ఢీకొని పెద్దపులి మరణించిందని అటవీశాఖ అధికారులు వెల్లడించారు. ఆదివారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో మహానంది మండలంలోని గాజులపల్లి నుండి చలమ రైల్వే స్టేషన్ మధ్యలో పెద్దపులి రైలు ఢీకొని మరణించిందని స్టేషన్ అధికారి ద్వారా సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు పులి మృతి చెందిన స్థావరానికి చేరుకుని పరీక్షించారు. సుమారు 5 సంవత్సరాల వయసు కలిగినటువంటి ఆడపులిగా నిర్ధారించి, అటవీ శాఖ నిబంధనల ప్రకారం ఐఎఫ్ఎస్ సెల్వం , నాగార్జునసాగర్ శ్రీశైలం ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ నంద్యాల మరియు డిప్యూటీ డైరెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ఐఎఫ్ఎస్,నంద్యాల వన్యప్రాణి విభాగం మరియు నిషాకుమారిఐఎఫ్ఎస్ ,వన్యప్రాణి విభాగం గిద్దలూరు మరియు ఎన్ ఎస్ టి ఆర్ వైద్య బృందం, చలమ రేంజ్ ఎఫ్ ఆర్ వో నాగభూషణ్ ఆధ్వర్యంలో గాజులపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ శివానంద్ వైద్య బృందం మరణించిన పెద్దపులికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో చలమయ్య ఎఫ్ఎస్ఓ విజయవర్ధన్, పెద్ద కంబులూరు ఎఫ్ఎస్ఓ కే మద్దిలేటి స్వామి, చలమ బీట్ అధికారిని రమాదేవి, కోటకొండ ఎఫ్బి ఓ నాగప్ప పాల్గొన్నారు.



## స్వార్థానికి బలి అవుతున్న జలాశయాలు

**ఎండనున్న మూగజీవాల గొంతులు!**



**రుద్రవరం ప్రతినిధి మే 25 (నంది పత్రిక):** చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం ఏదో భారీ వర్షానికి రోడ్లపై పారుతున్న నీరు అనుకుంటే పొరపాటే. అది.. కొందరు వ్యక్తుల స్వార్థానికి వృధాగా పోతున్న అమూల్యమైన తాగునీరు. రుద్రవరం మండలంలోని కొండమాయపల్లి 'చిన్నరాజు చెరువు'లో చేపలు పట్టుకోవడం కోసం, కొందరు వ్యక్తులు తూముల ద్వారా నీటినంతటినీ బయటకు వదిలేశారు. దీంతో ఆ నీరంతా వృధాగా గ్రామంలోని వీధుల గుండా ప్రవహిస్తోంది. ఒకపక్క ఎండలు మండిపోతుంటే, మరోపక్క ఇలా చెరువును ఖాళీ చేయడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు నీరే ఆ ప్రాంతంలోని పశువులకు, మూగజీవాలకు ప్రధాన తాగునీటి వనరు. ఇప్పుడు చెరువు అడుగంటడంతో, ఈ భానుడి భగభగలకు పశువుల గొంతు ఎండనుంది. కొందరు వ్యక్తులు కేవలం లక్షలాది రూపాయల స్వలాభం కోసం చేపల వేటపైనే శ్రద్ధ పెట్టారని, మూగజీవాల ప్రాణాలను గాలికొదిలేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "లక్షల రూపాయల ఆదాయం కోసం చెరువును ఖాళీ చేస్తుంటే అధికారులు కళ్లుండి కూడా చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, చెరువుల్లోని నీటిని వృధా చేయకుండా అడ్డుకోవాలి. పశువుల ప్రాణాలను కాపాడాలి అని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు"

# కారల్ మార్స్ నగర్ వాసులకు పట్టాలు ఇవ్వాలి,,,సిపిఐ



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు నగరంలోని రెవెన్యూ వార్డు అయినా 48వ వార్డులో గత 30 సంవత్సరాల క్రితం కేసీ కెనాల్ వెంట ఉన్న ప్రభుత్వ పోరంబోకు స్థలంలో పేదలు కొట్టాలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని సోమవారం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ని సిపిఐ నాయకులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది కలిసిన వారిలో సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి నగర సహాయ కార్యదర్శి సి మహేష్ నగర కార్యవర్గ సభ్యులు డి.నల్లన్న బి.వెంకటేష్ ఆర్ .కిట్టు శాఖ కార్యదర్శి నాగరత్నమ్మ మరియమ్మ జాయింట్ కలెక్టర్ కలిసిన వారిలో ఉన్నారు సందర్భంగా జాయింట్ కలెక్టర్ కి పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా కే సీ కెనాల్ ప్రక్కన ప్రభుత్వపోరంబోకు స్థలంలో కొట్టాలు వేసుకొని కాపురాలు ఉన్న సందర్భంగా పేదలందరికీ కొట్టాలు కు పట్టాలు ఇవ్వడం జరిగినది అదే సందర్భంలో ప్రభుత్వం ఇండ్లు నిర్మించుకోవడానికి హౌసింగ్ వారి ద్వారా దరఖాస్తు చేసుకోండి అని చెప్పడంతో అందరూ కూడా ఇండ్లు కట్టుకోవడానికి ఒరిజినల్ పట్టాలని హౌసింగ్ అధికారుల దగ్గర పట్టాలు పెట్టి హౌసింగ్ లోన్ తీసుకొని ఇండ్ల నిర్మించుకోవడం జరిగింది ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు ప్రజలకు ఇచ్చిన మాట ఏమిటంటే మీ ఇండ్లు పూర్తయిన తర్వాత మీ పట్టాల మీకు ఇస్తామన్నారు కానీ ఇప్పటిదాకా మాకు ఒరిజినల్ పట్టాలు అందలేదు గత 20 రోజుల క్రితం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు . కావున ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్ స్పందించి వారికి ఒరిజినల్ పట్టాలు ఇప్పించండి లేదా కల్లూరు తాసిల్దార్ తో మాట్లాడి డూప్లికేట్ పట్టాలన్న ఇప్పించాలని జాయింట్ కలెక్టర్ ని కోరడం జరిగినది జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తక్షణమే ఎమ్మార్వో తో మాట్లాడి మీ సమస్య పరిష్కారం అయ్యే దానికోసం కృషి చేస్తానని సిపిఐ నాయకులకు హామీ ఇవ్వడం జరిగినది.

# ఇంధన ధరల పెంపు సామాన్యుడి పై ఆర్థిక భారం

### పెంచిన ధరలు తగ్గించాలి
### మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె మే 25నందిపత్రిక** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెంచుతూ సామాన్య ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయని బనగానపల్లె నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన ఆవేదనను వ్యక్తం చేశారు.సోమవారం ఆయన ఓ ప్రకటన ద్వారా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన ధరలను ఆమాంతం పెంచడం వల్ల సామాన్యుడి పై ఆర్థిక భారం పడిందని దీని ప్రభావంతో రవాణా ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే నాలుగు సార్లు ఇంధన ధరలు పెంచడం ప్రజలపై ఆర్థిక భారం మోపడమేనన్నారు. మే 15న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 చొప్పున పెంచగా, మే 19న పెట్రోల్‌పై 95 పైసలు, డీజిల్‌పై 97 పైసలు, మే 23న పెట్రోల్‌పై 97 పైసలు, డీజిల్‌పై 99 పైసలు, మే 25న తాజాగా పెట్రోల్‌పై రూ.2.87, డీజిల్‌పై రూ.2.85 పెంచారని వివరించారు. మొత్తంగా పది రోజుల్లోనే పెట్రోల్ ధర లీటరుకు రూ.7.79, డీజిల్ ధర రూ.7.81 పెరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోనే దేశంలో అత్యధిక ఇంధన ధరలు ఉన్నాయని, పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు రూ.10 వరకు ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు కూటమి ప్రభుత్వం మద్దతు ఇస్తూ ప్రజలపై మరింత భారం మోపుతోందని మండిపడ్డారు. పొరుగు రాష్ట్రాల మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంధన ధరలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న పన్నులను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చమురు కొరత ఉండదు.. ధరలు పెరగవు అంటూ హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు, నేడు వరుసగా ధరలు పెంచుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ధరలు తగ్గించాలని ఇదివరకే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టి, ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోక, వరుసగా ధరలను పెంచుకుంటూనే పోతున్నారన్నారు. ప్రజల ఆవేదనను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఇంధన ధరల పెంపును ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కాటసాని రామిరెడ్డి హెచ్చరించారు.

## ఉపాధి పనిలో రెండుసార్లు ఫోటో యాప్ రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా



**కోవెలకుంట్లమే 25నందిపత్రిక** ఉపాధి పనులకు వెళుతున్న కూలీలకు రెండుసార్లు ఫోటో తీయడం ఇబ్బందికరంగా మారిందని దీనిని రద్దు చేయాలని సోమవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం మండల కార్యాలయం ముందు ధర్నా నిరహించారు.అనంతరం సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ నరసింహ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఏం సుధాకర్ ,మండల కార్యదర్శి రాములమ్మ లు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేసవిని దృష్టిలో పెట్టుకొని ఉదయం 5 ,30 నుండి 9:30 వరకు పనులు చేపట్టాలని, అలాగే ఎండాకాలము దృష్టిలో పెట్టుకొని కూలీలకు మజ్జిగ పంపిణీ ,ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు ,పనిచేసే చోట టెంట్ సౌకర్యం కల్పించాలి. అదేవిధంగా కూలీలు వడదెబ్బ వల్ల మరణించిన ,ఏదైనా ప్రమాదానికి గురైన రెండు లక్షల పరిహారం ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న ఉపాధి బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు శోభారాణి ,ప్రమీల,నిర్మల, మరియా రోజి, ఈశ్వరమ్మ, ఓబులేసు, సరోజ మరియు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏ ఓ స్వాతి

**వెలుగోడు, మే 25, నంది పత్రిక** :రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వెలుగోడు మండల వ్యవసాయ అధికారి స్వాతి సూచించారు. వ్యవసాయ శాఖ నుండి లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని ఆమె కోరింది. కొనుగోలు చేసిన విత్తనాలు తప్పనిసరిగా రసీదు అడిగి తీసుకోవాలని విత్తనాల ప్యాకింగ్ సరిగా ఉందో లేదో పరిశీలించి, ముఖ్యంగా గడువు తేదీ (ఎక్స్‌పైరీ డేట్) చూసుకొని మాత్రమే కొనుగోలు చేయాలని అనధికారికంగా విత్తనాలు విక్రయించే వస్తువులను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా వెలుగోడు పట్టణంలోని "విశ్వంబర సీడ్" దుకాణాన్ని ఏ ఓ స్వాతి తనిఖీ చేశారు. అక్కడి విత్తనాల నుంచి నమూనాలను సేకరించి పరీక్షల నాణ్యత కోసం ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు.




## దేశ వ్యాప్తంగా పెరిగిన విద్యుత్ అవసరాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి

### కేంద్ర గనులు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ.

### ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణాలకు 6వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశాం

### రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మరియు పశ్చిమ గోదావరి జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్



**పెనుమంట్ర/పెనుగొండ,బ్యూరో చీఫ్ మే 25 నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గ పరిధిలోని పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం కేంద్ర గనులు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మరియు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి, పశ్చిమ గోదావరి జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. ముందుగా పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, రూ.20.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంత్రులు ప్రారంభించారు. అనంతరం గరువు గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ప్రారంభించారు. అలాగే నౌడూరు సెంటర్ నుండి బ్రహ్మణ చెరువు వరకు రూ.2.50 కోట్లతో నిర్మించిన రహదారిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. నెగ్గిపూడి గ్రామంలోని ఎస్సీ/ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. తదనంతరం పెనుగొండ మండలంలోని 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో నూతన 50 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అదేవిధంగా వడలి నుండి జాతీయ రహదారి-16 వరకు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన డబ్ల్యూబీఎం రహదారిని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరిగాయని, ఇందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. గృహ మరియు వాణిజ్య అవసరాల దృష్ట్యా పశ్చిమగోదావరి జిల్లాలో మరిన్ని సబ్ స్టేషన్లు అవసరమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు.రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణాలకు సుమారు రూ.6 వేల కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కట్టుబడి ఉన్నారని, విద్యుత్ ఛార్జీలు పెంచకుండా సేవలు అందించాలనే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత రెండు సంవత్సరాలుగా విద్యుత్ చార్జీలు పెంచలేదని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశామని, వినియోగదారుల ఫిర్యాదులకు అధికారులు త్వరితగతిన స్పందించాలని సూచించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు, ఏపీ అసెంబ్లీ ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాల గృహాలకు ఉచిత సోలార్ విద్యుత్ ప్యానెల్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీ వర్గాలకు సబ్సిడీతో పాటు అదనంగా రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. మిగతా వర్గాల వారికి కూడా సబ్సిడీతో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. నియోజకవర్గంలో అవసరమైన కండెన్సర్ల మంజూరుకు ఇప్పటికే ఇంధన శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో దాసి రాజు, ఆచంట నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి.పిచ్చయ్య, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.వెంకటరత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐయినం పూడి శ్రీదేవి, పెనుమంట్ర తహసిల్దార్ రవికుమార్, పెనుగొండ తహసిల్దార్ అనిత కుమారి, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇరాన్‌లో అమెరికా దాడులు.. కాల్పుల విరమణ వేళ తీవ్ర ఉద్రిక్తత

కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ దక్షిణ ఇరాన్‌లో అమెరికా బలగాలు సోమవారం రక్షణాత్మక దాడులు నిర్వహించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇరాన్ బలగాల నుంచి తమ సైనికులకు ముప్పు పొంచి ఉన్నందునే ఈ దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది.సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ మాట్లాడుతూ.. ఇరాన్‌కు చెందిన క్షిపణి ప్రయోగ కేంద్రాలు, వ్యూహాత్మక జలమార్గంలో మైన్‌లు అమర్చేందుకు ప్రయత్నిస్తున్న పడవలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్లు తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉన్నప్పటికీ తమ బలగాలను రక్షించుకునే చర్యలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఫాక్స్ న్యూస్ కథనం ప్రకారం ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు చెందిన రెండు పడవలు మైన్‌లు అమర్చుతుండగా అమెరికా బలగాలు వాటిని ధ్వంసం చేశాయి. దీంతోపాటు బందర్ అబ్బాస్‌లో అమెరికా యుద్ధ విమానాలను లక్ష్యంగా చేసుకున్న ఒక క్షిపణి కేంద్రాన్ని కూడా ధ్వంసం చేసినట్లు తెలిసింది. అయితే, ఇవి కేవలం రక్షణాత్మక దాడులు మాత్రమేనని, దీనివల్ల కాల్పుల విరమణ ఒప్పందం ముగిసినట్లు కాదని అమెరికా అధికారులు పేర్కొన్నారు.మరోవైపు హార్మూజ్ జలసంధికి సమీపంలో ఉన్న బందర్ అబ్బాస్, సిరిక్, జాస్క్ ప్రాంతాల్లో భారీ పేలుళ్లు వినిపించినట్లు ఇరాన్ మీడియా సంస్థలు తస్నీమ్, ఫార్స్ వెల్లడించాయి. అయితే, బందర్ అబ్బాస్‌లో పరిస్థితి అదుపులోనే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మెహర్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. ఇదే సమయంలో జరుగుతున్న చర్చల్లో భాగంగా ఇరాన్ తమ శుద్ధి చేసిన యురేనియం నిల్వలను వదులుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలోని కీలకమైన ఇంధన రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి.

## పోలకల్ లో ప్రారంభం కానున్న తితిదే ధార్మిక కార్యక్రమాలు



**సి. బెళగల్ . మే 25. (నంది పత్రిక ):** తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సి. బెళగల్ మండలం, పోలకల్ గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం నందు మంగళవారం నుండి శుక్రవారం వరకు ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబందించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంచే ఆవిష్కరింప చేశారు. మంగళవారం నుండి గురువారం వరకు సాయంత్రం 6-00 గం. నుండి మూడు రోజులపాటు కర్నూలు నగరానికి చెందిన ఈ. ఆర్. కె. వి. ప్రసాదరావుచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం సాయంత్రం 4.00 గం. నుండి గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ మందిరం అర్చకులు ఆవుల తిక్కన్న, జి. సోమప్ప, వై. వేంకటేశ్వర్లు, వై. శోభన్ బాబు, వై. శేఖర్, ఎ. దస్తగిరి, వై. గోపాల్, తపాల వెంకటేశ్, జె. సుంకన్న, డి. పరసురాముడు, డి. మల్లేశ్, బి. శ్రీనివాసులు, ఎ. చిన్నబసన్న, ఎ. పెద్దబసన్న పాల్గొన్నారు.

## నంద్యాలలో వక్ఫ్ బోర్డు స్థలాలను పరిశీలించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

### వక్ఫ్ భూములు ఆక్రమణకు గురైతే సహించేది లేదు: మంత్రి ఫరూక్ హెచ్చరిక



**నంద్యాల సిటీ బ్యూరో మే 25 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణ పరిధిలోని వక్ఫ్ బోర్డు స్థలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నంద్యాల - చాబోలు హైవే రోడ్డులో గల వక్ఫ్ బోర్డు స్థలాన్ని, అలాగే ఆర్.జీ.ఎమ్ ఇంటర్నేషనల్ స్కూల్ పక్కన ఉన్న మసీదుకు అనుకుని ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకు చెందిన విలువైన స్థలాలు అన్యాక్రాంతమైనా, లేదా ఎవరైనా అక్రమంగా ఆక్రమణలకు గురిచేసినా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు భూములను కాపాడటంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, ఆక్రమణదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, వక్ఫ్ బోర్డు సభ్యులు ఇక్రమ్ సాహెబ్, జాకీర్ సాహెబ్, ఇస్మాయిల్ బేగ్, మొకరం సాహెబ్, సాహెబ్, సీఈఓ యాకూబ్,డి.ఎమ్.డబ్ల్యు.ఓ సబీహా పర్వీన్, అరుణ్ బేగ్, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు వరం

### ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ

### రూ"38,16,958 సీఎం రిలీఫ్ చెక్కులను బాధితులకు అందజేసిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే25, నంది పత్రిక** సిఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు వరం లాంటిదని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితుల కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నామన్నారు. సీఎంఆర్ఎఫ్ కింద మొత్తం రూ.38,16,958 విలువైన చెక్కులను పలువురు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేయడం హర్షణీయమన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టాలు వచ్చినా ప్రభుత్వం, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం అందేలా కృషి చేస్తున్నామనీ ఆమె తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాలు సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరివెళ్ళ మండల టీడీపీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, బాధితకుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలి





## పీజీఆర్ఎస్‌లో 145, రెవెన్యూ క్లినిక్‌లో 45 దరఖాస్తుల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరంబ్యూరో చీఫ్ మే 25,నంది పత్రిక** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల నుండి స్వీకరించిన ప్రతి అర్జీని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, డీపీఓ వై.దోసిరెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సిహెచ్ అప్పారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ రోజు నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 145 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌లో 45 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామం ఆర్. కృష్ణమూర్తి తనకు 1.17 సెంట్ల భూమి ఉండగా, రీ సర్వే అనంతరం 1.06 సెంట్లు మాత్రమే నమోదు అయ్యిందని, 11 సెంట్ల భూమి తగ్గిందని పేర్కొంటూ తిరిగి రీ సర్వే నిర్వహించి తన భూమిని తిరిగి అప్పగించాలని అర్జీ సమర్పించారు. పోడూరు మండలం జిన్నూరుపాలెం గ్రామం కందిబోయిన శ్రీనివాస్ తన ఇంటి స్థలం 22-ఏ నిషేధిత భూముల జాబితాలో నమోదైందని, దానిని 22-ఏ జాబితా నుండి తొలగించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. భీమవరం మండలం తాడేరు గ్రామం అడబాల దాసు బ్యాంకు రుణంతో ఇల్లు నిర్మించుకున్నానని, తన కుమారుడు, కోడలు ఇంటిలో ఉండనీయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, తనకు మరియు తన భార్యకు రక్షణ కల్పించాలని కోరారు. ఉండి మండలం మహాదేవపట్నం గ్రామం షేక్ బాజీమ్ బీబీ తనకు మెదడులో రక్తం గడ్డకట్టడం వల్ల ఎడమ వైపు పూర్తిగా పనిచేయడం లేదని, 100 శాతం వైకల్యం ఉన్నందున వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భీమవరం మండలం గునుపూడి సమీపంలోని ఎల్వీటీ ప్రాంతనివాసి ఉండి శ్రీనివాస బాబు తమ ప్రాంతంలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదని, శాశ్వత పరిష్కారంగా తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

### గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలి

### సెప్టిక్ వ్యర్థాలతో పర్యావరణం కాలుష్యం .. కఠిన చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు



**భీమవరంబ్యూరో చీఫ్ మే 25,నంది పత్రిక** జిల్లాలోని ఏ మారుమూల గ్రామంలో కూడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యల నివారణపై సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెనుమంట్ర మండలం నేలమూరు గ్రామంలో త్రాగునీటి సమస్య నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని, చెరువులోని నీటిని శుద్ధి చేసి పైప్‌లైన్ ద్వారా ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేసి ప్రజలకు నిరంతర నీటి సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు. రాత్రివేళల్లో గ్రామస్తులు మంచినీటి కొళాయిల వద్ద స్నానాలు చేయకుండా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలోని చెరువుల నీటి నిల్వ స్థాయి, లోతు తదితర అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకులు ఎల్లప్పుడూ నీటితో నిండుగా ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీల్లో కూడా అవసరమైతే జనాభా ప్రాతిపదికన ట్యాంకర్ల ద్వారా వార్డు వార్డుకు నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రజల నుండి తాగునీటి సమస్యలపై ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని హెచ్చరించారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను నిరంతరం పరిశీలిస్తున్నామని తెలిపారు. తాగునీటి సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడా మంచినీటి పైప్‌లైన్‌లకు లీకేజీలు లేకుండా తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

**ఎస్టీపీల స్థలాల సేకరణపై సమీక్ష** అనంతరం మున్సిపల్ ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్టీపీల (సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు) ఏర్పాటుకు అవసరమైన స్థలాలను వెంటనే సేకరించాలని ఆదేశించారు. సెప్టిక్ ట్యాంకుల ద్వారా విడుదలవుతున్న వ్యర్థాలు పర్యావరణ కాలుష్యానికి కారణమవుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న సెప్టిక్ ట్యాంకుల సంఖ్య, వాటి వ్యర్థాలను ఎక్కడ విడుదల చేస్తున్నారనే పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సెప్టిక్ వ్యర్థాలు డ్రైన్లు, కాలువలు ద్వారా సముద్రాల్లో కలవడం వలన జల కాలుష్యం పెరుగుతోందని, దీనిని పూర్తిగా నివారించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. తణుకు, పాలకొల్లు మండలాల్లో ఎస్టీపీలకు అనువైన స్థలాలు అందుబాటులో ఉన్నందున వెంటనే గ్రౌండ్ లెవల్ పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే ఆకివీడు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో కూడా స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సెప్టిక్ ట్యాంకర్ యజమానులతో సమావేశాలు నిర్వహించి పర్యావరణ కాలుష్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా బహిరంగ ప్రదేశాల్లో సెప్టిక్ వ్యర్థాలను పారబోసే పరిస్థితులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# భీమవరం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా

## ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పులపర్తి రామాంజనేయులు ప్రమాణ స్వీకారం





### రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

### పులపర్తి రామాంజనేయులు

**భీమవరం బ్యూరో చీఫ్ మే 25 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్ఎస్‌డీ) చైర్మన్‌గా శాసన సభ్యులు మరియు ప్రభుత్వ విప్ పులపర్తి రామాంజనేయులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. భీమవరం ఏరియా ఆసుపత్రి సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కమిటీకి చెందిన 11 మంది సభ్యులతో కలిసి ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కమిటీ సభ్యులుగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, బలహీన వర్గాల సామాజిక కార్యకర్తలు యర్రంశెట్టి శివకృష్ణ, మైలబత్తుల ఇసాక్, పేదరిక నిర్మూలన సామాజిక కార్యకర్త సుంకర దాస్, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. లక్ష్మణ్ జితానంద్, పట్టణ మహిళా సమాఖ్య సభ్యురాలు కోణాల దొర్కా రాణి, ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు.రాజాబాబు, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఐఎంఏ సభ్యుడు మూలం గోవిందబాబు, అదనపు డీఎంహెచ్‌వో ఎం.రవిబాబు నియమితులయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ మరియు కమిటీ సభ్యులు రిజిస్టర్‌లో సంతకాలు చేసి ఆసుపత్రి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలోపేతం చేసి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భీమవరం ఏరియా ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి పరచడానికి ప్రత్యేక కార్యాచరణ చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రిలో మౌలిక వసతుల అభివృద్ధి, భవన మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య నిర్వహణ, కొత్త వైద్య పరికరాల కొనుగోలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన సేవలు అందేలా వైద్యులు, నర్సులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే రోగులకు అవసరమైన మందులు, వైద్య పరికరాల వినియోగం, వైద్య సిబ్బంది పనితీరు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. లక్ష్మణ్ జితానంద్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పారదర్శకతతో సేవలు అందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి విభాగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. లక్ష్మణ్ జితానంద్, ఆసుపత్రి పరిపాలన అధికారి సిహెచ్ దివ్య ప్రశాంతి, సూపరింటెండెంట్ పి.రమేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ వై.కృష్ణయ్య, స్థానిక నాయకులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి తీవ్రత దృష్ట్యా పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండాలి

### అధిక ఉష్ణోగ్రతల వల్ల కోళ్లు ఓవర్‌హీట్‌కు గురై మృత్యువాత పడే అవకాశం

### పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలి - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం:చీఫ్ బ్యూరో మే 26,నంది పత్రిక** వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉంటూ తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సోమవారం పశుసంవర్ధక శాఖ అధికారులు, పౌల్ట్రీ యజమానులు, పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వేసవి తీవ్రత దృష్ట్యా పౌల్ట్రీ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 45 డిగ్రీల సెంటీగ్రేడ్ నుండి 48 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్లు ఒత్తిడికి గురై ఓవర్‌హీట్ కారణంగా మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల పౌల్ట్రీ రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జూన్ మొదటి వారం వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున పశుసంవర్ధక శాఖ అధికారులు పౌల్ట్రీ రైతులకు ముందస్తు జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పౌల్ట్రీ రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏయే పౌల్ట్రీ ఫార్మ్‌ల్లో కోళ్ల మరణాలు అధికంగా నమోదవుతున్నాయనే అంశంపై జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఫెడరేషన్ సభ్యులు పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కోళ్ల ఫీడ్, మందుల ధరలు పెరగడం వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా యంత్రాంగం తరఫున పౌల్ట్రీ రైతులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కోటిలింగరాజు డివిజనల్ స్థాయి అధికారులు, పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఫెడరేషన్ సభ్యులు, వెటర్నరీ వైద్యులు, పౌల్ట్రీ యజమానులు పాల్గొన్నారు.




# ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు పెంపొందించాలి



### గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు పుస్తక పఠనంతో జిజ్ఞాస, ఆలోచనా శక్తి పెరుగుతుంది

### సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచి పిల్లలను గ్రంథాలయాలకు పంపాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచనలు

**భీమవరంబ్యూరో చీఫ్ మే 25,నంది పత్రిక** ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు పెంపొందించుకోవాలని, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. పెనుమంట్ర శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న “వేసవి విజ్ఞాన తరగతులను” సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతులకు ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారో, వారికి ఏయే విషయాలను బోధిస్తున్నారో, చదవడం నేర్పిస్తున్నారా అనే అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులతో స్వయంగా చదివించి వారి ప్రతిభను పరిశీలించారు. చదవడం బాగా రాని విద్యార్థులు, కూడపలుక్కుని చదివే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేగంగా చదవడం అలవాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలకు పద్యాలు, నీతి కథలు చెప్పాలని, కథల్లోని పాత్రలను వారితో నటింపజేస్తే కథలపై ఆసక్తి పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా మెరుగుపడుతుందని తెలిపారు. కథ ముగింపును పుస్తకంలో ఉన్నట్లుగా కాకుండా వేరే విధంగా ఉంటే ఎలా ఉంటుందో పిల్లలతో ఆలోచింపజేస్తే వారి ఆలోచనా శక్తి పరిణతి చెందుతుందని, తద్వారా స్వయంగా ఆలోచించే సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా పిల్లల్లో జిజ్ఞాస పెరుగుతుందని, అదే వారిని సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏడో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు కూడా, సరిగా చదవలేకపోవడంపై జిల్లా కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత విద్యాశాఖ అధికారిని ప్రశ్నిస్తూ పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. ఒక వారం రోజులపాటు క్రమబద్ధంగా చదివిస్తే పిల్లలకు చదివే అలవాటు ఏర్పడుతుందని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, పెనుమంట్ర శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు డి.కృష్ణారావు, ఎంఈఓ ఉంగరాల నాగేశ్వరరావు, ఎంపీడీవో సిహెచ్.కె వెంకటరెడ్డి, తహసిల్దార్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యాయులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ

భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పారా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్ధకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకులు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజరానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్-జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్నట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది. అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.

# ఆదివాసీలను గౌరవించే సంక్షేమం కావాలి!

ఇటీవల ఒడిశాలో వెలుగుచూసిన ఒక దిగ్భ్రాంతికర సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. జితు ముండా అనే వృద్ధ ఆదివాసీ మరణించిన తన సోదరి ఖాతాలోని కొద్దిపాటి డబ్బు కోసం చివరకు ఆమె అస్థిపంజరాన్ని బ్యాంకు దాకా తీసుకురావాల్సి వచ్చింది. పైకి ఇది సాధారణ బ్యాంకింగ్ సమస్యలా కనిపించినా, వాస్తవానికి ఇది చాలా పెద్ద సంక్షోభానికి సంకేతం. నెలల తరబడి మరణ ధ్రువీకరణ పత్రం రాకపోవడం; ఆధార్ లేకపోవడం వల్ల రేషన్ లభించకపోవడం, వృద్ధాప్య పింఛన్ రాకపోవడం; అడుగడుగునా తమ పేదరికాన్ని, అర్హతను నిరూపించుకోవాల్సిన ఒత్తిడి ఇవన్నీ కలిసి ఆయన కనీస మానవ గౌరవాన్ని పక్కనపెట్టి వ్యవస్థ ముందుకు రావాల్సిన దయనీయ పరిస్థితిని సృష్టించాయి. ఈ సంక్షోభానికి పరిష్కారం ఆదివాసీలకు హక్కుల ఆధారిత, సార్వత్రిక (యూనివర్సల్) సామాజిక రక్షణను హామీ ఇవ్వడంలోనే ఉంది. సామాజిక సంక్షేమ పథకాల అమలులో రెండు ప్రధానమైన విధానాలు: 'లక్షిత విధానం' (ఖుతీస్త్రవ్‌అఅస్త్ర) జం 'సార్వత్రిక విధానం' (ఖఅఅజవతీయిశ్రీఙఎ) ఉదాహరణకు వృద్ధాప్య పింఛన్లనే తీసుకుంటే 'లక్షిత విధానం'లో 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించాక, ప్రభుత్వ డేటాబేస్‌ల ద్వారా వారి ఆర్థిక స్థితిని అంచనా వేస్తారు. ఆదాయపు పన్ను, ఎక్కువ భూమి, నాలుగు చక్రాల వాహనాలు వంటి సంపద సూచికలు లేనివారిని మాత్రమే అర్హులుగా ఎంపిక చేస్తారు. దీనికి భిన్నమైనది 'సార్వత్రిక విధానం'. ఇందులో ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడికి బేషరతుగా పింఛన్ అందిస్తుంది. పౌరులందరినీ సామాజిక భద్రతా పరిధిలోకి తీసుకురావడమే దీని ప్రధాన లక్ష్యం.ప్రస్తుతం చాలా పథకాలు 'పేదరిక ఆధారిత లక్షిత విధానం' (గాశీజవతీఎ ఖుతీస్త్రవ్‌అఅస్త్ర)పైనే ఆధారపడి నడుస్తున్నాయి. ప్రభుత్వాలు దీనిని 'పరిపాలనా సామర్థ్యం' పేరుతో సమర్థిస్తుంటాయి. నిధుల లీకేజీలు తగ్గించి, ప్రభుత్వ సహాయాన్ని అర్హులుగా గుర్తించిన వర్గాలకే పరిమితం చేయాలనేది వారి వాదన. ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు కూడా ఈ విధానాలను ప్రోత్సహిస్తున్నాయి. ప్రభుత్వ సహాయం 'అర్హులకే' పరిమితం కావాలని భావించే సమాజంలోని ప్రభావశీల వర్గాలు కూడా ఈ లక్షిత విధానాలకే మద్దతు ఇస్తున్నాయి.సిద్ధాంతపరంగా చూస్తే ఈ 'టార్గెటింగ్' విధానం సరైనదిగానే అనిపించవచ్చు. కానీ ఆచరణలో అది చాలా సంక్లిష్టమైన, భారీ పరిపాలనా యంత్రాంగంగా మారుతోంది. ఎందుకంటే 'నిజమైన పేదలు' ఎవరో గుర్తించడానికి ప్రభుత్వాలు ఇప్పుడు విస్తృతమైన డేటాబేస్‌లు, ఆధార్ అనుసంధానం, బ్యాంక్ లింకింగ్, భూమి రికార్డులు, మొబైల్ నంబర్లు, డిజిటల్ ధ్రువీకరణ వంటి వ్యవస్థలపై ఆధారపడుతున్నాయి. ఫలితంగా సంక్షేమ వ్యవస్థలు ప్రజలకు సహాయం చేసేవిగా కాకుండా, డిజిటల్ ధ్రువీకరణ, అర్హత తనిఖీలపై అధికంగా ఆధారపడే యంత్రాంగాలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వాలు టార్గెటింగ్‌ను డబ్బు ఆదా చేసే విధానంగా చూపిస్తుంటాయి. కానీ ఈ భారీ డిజిటల్ డేటాబేస్‌ల నిర్మాణం, నిర్వహణ, ధ్రువీకరణ వ్యవస్థలు, సాఫ్ట్‌వేర్ మౌలిక వసతులపై ప్రజాధనం ఎంత ఖర్చవుతోందో చాలా అరుదుగా చర్చకు వస్తుంది. అంతకంటే ముఖ్యంగా, ఈ క్రమంలో ప్రజలు భరిస్తున్న ఖర్చులు పూర్తిగా కనిపించకుండా పోతున్నాయి. ఆధార్ కేంద్రాలకు ప్రయాణాలు, కోల్పోయే కూలి, ఆహార ఖర్చులు, మధ్యవర్తులకు చెల్లింపులు ఇవన్నీ పేద కుటుంబాల భుజాలపై అదనపు భారంగా మారుతున్నాయి.దీనికి భిన్నంగా, 'యూనివర్సల్' విధానం చాలా సరళమైనది. ఇందులో వ్యవస్థ ప్రధాన లక్ష్యం ప్రజలను వడపోసి తొలగించడం కాదు; అందరినీ రక్షణ పరిధిలోకి తీసుకురావడం. ముఖ్యంగా చారిత్రకంగా వెనుకబడిన సమాజాల విషయంలో, ఈ సార్వత్రిక విధానం మరింత న్యాయసమ్మతమైనది.సాధారణ ప్రజలకే ఈ వ్యవస్థలు ఇంత క్లిష్టంగా మారుతుంటే, ఆదివాసీ సమాజాల విషయంలో పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది. ఎందుకంటే ప్రతి వ్యక్తికి స్థిరమైన డాక్యుమెంట్లు, బ్యాంక్ ఖాతాలు, ఇంటర్నెట్, మొబైల్ కనెక్టివిటీ ఉన్నాయనే ఊహతో డిజిటల్ వ్యవస్థలు పనిచేస్తాయి. కానీ ఆదివాసీల జీవిత వాస్తవాలు చాలా భిన్నంగా ఉంటాయి. గతంలో ఆదివాసీ సంక్షేమం అనగానే షెడ్యూల్డ్ ఏరియాలు, అడవులు, భూమితో ముడిపడి ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. వలసలు, పట్టణీకరణ, సంప్రదాయ జీవనాధారాలు దెబ్బతినడం, ఉపాధి మార్గాలు మారడం ఇవన్నీ కలిసి ఆదివాసీల జీవన భౌగోళికతను మార్చేశాయి. చాలామంది ఆదివాసీలు ఇప్పుడు షెడ్యూల్డ్ ఏరియాలకు వెలుపల, పట్టణాల అంచుల్లో లేదా అనధికారిక కాలనీల్లో అస్థిర జీవితం గడుపుతున్నారు. ఈ మార్పు కేవలం నివాస ప్రాంతాల మార్పుగానే కాక, సంక్షేమ వ్యవస్థలతో వారి సంబంధాన్నే సంక్లిష్టంగా మార్చుతోంది. ప్రస్తుతం అమలవుతున్న 'పేదరిక ఆధారిత లక్షిత విధానాలు' స్థిరమైన చిరునామాలు, భూమి రికార్డులు, ఆధార్ అనుసంధానం, బ్యాంక్ ఖాతాలు వంటి డాక్యుమెంటేషన్‌పై అధికంగా ఆధారపడుతున్నాయి. కానీ వలసలు, అస్థిర జీవన పరిస్థితులు, బలహీనమైన పరిపాలనా గుర్తింపుల కారణంగా అనేక ఆదివాసీ కుటుంబాలకు ఈ డాక్యుమెంట్లను సమకూర్చుకోవడమే కష్టంగా మారుతోంది.ప్రత్యేకంగా యానాది, చెంచు వంటి సమాజాల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రమైంది. భూమి, స్థిరమైన ఉపాధి లేకుండా, చెత్త ఏరుకోవడం వంటి అసురక్షిత పనులపై ఆధారపడుతున్న అనేక కుటుంబాలు ప్రభుత్వం ఊహిస్తున్న 'స్థిరమైన పేద కుటుంబం' అనే పరిపాలనా నమూనాలో సరిపోవడం లేదు. ఫలితంగా, అత్యంత అసురక్షిత పరిస్థితుల్లో ఉన్నవారే సంక్షేమ వ్యవస్థలకు దూరమవుతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో 'టార్గెటింగ్' కంటే 'యూని వర్సాలిటీ' మరింత కీలకం. సంక్షేమం అనేది భౌగోళికతను కాదు, మనిషిని అనుసరించాలి. ఆదివాసీల హక్కులు వారు ఎక్కడ నివసిస్తున్నారనే దానిపై ఆధారపడి అదృశ్యం కాకూడదు. అందుకే ఆదివాసీల కోసం 'యూనివర్సల్, హక్కుల ఆధారిత సామాజిక రక్షణ' అవసరం. అంటే, ఆదివాసీలను ముందుగా అనుమానంతో చూడకుండా, సంక్షేమాన్ని వారికి సహజ హక్కుగా గుర్తించడం. ఉదాహరణకు, అన్ని ఎస్టీ కుటుంబాలకు ఆటోమేటిక్‌గా ఆహార భద్రత, వృద్ధాప్య పింఛన్ వంటి ప్రాథమిక సామాజిక రక్షణ పథకాలను అందించే విధానాన్ని ప్రభుత్వం పరిశీలించాలి. ఇది కేవలం పరిపాలనా సౌలభ్యం కాదు; ఇది రాజ్యాంగ నైతికతకు సంబంధించిన విషయం. అయితే కేవలం యూనివర్సల్ కవరేజ్ మాత్రమే సరిపోదు. ఆహార భద్రత చట్టం (చీఖీూూ), ఉపాధి హామీ చట్టం (వీ+చీ=జు+ూూ) నిరూపించినట్టుగా, సంక్షేమం హక్కుల ఆధారితంగా ఉన్నప్పుడే పౌరులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక, చట్టబద్ధమైన స్థానం లభిస్తుంది. సామాజిక రక్షణ హక్కుల ఆధారితంగా లేకపోతే, అది ప్రభుత్వాల ఇష్టానుసార మార్పులకు, పరిపాలనా పరిమితులకు లోనవుతుంది. ఆదివాసీలను కేవలం 'లబ్ధిదారులు'గా కాకుండా, హక్కులు కలిగిన పౌరులుగా గుర్తించినప్పుడే నిజమైన సామాజిక రక్షణ సాధ్యమవుతుంది. ఆదివాసీల సంక్షేమంలో 'టార్గెటింగ్' విధానం వల్ల అసలైన పేదలే నష్టపోతున్నారు. అనర్హులకు లబ్ధి చేకూరినా పర్వాలేదు కానీ, అర్హులు మాత్రం ఏ మాత్రం దూరం కాకూడదు. అనర్హులను కత్తిరించడం టార్గెటింగ్ లక్ష్యమైతే అర్హులను అక్కున చేర్చుకోవడం 'సార్వత్రిక (యూనివర్సల్)' విధానం ఉద్దేశం. అటవీ హక్కుల చట్టం స్వయంగా ఆదివాసీలపై జరిగిన చారిత్రక అన్యాయాన్ని అధికారికంగా గుర్తించింది. కానీ ప్రస్తుత డిజిటల్, టార్గెటింగ్ ఆధారిత సంక్షేమ వ్యవస్థలు మాత్రం ఆదివాసీ జీవిత వాస్తవాలను 'పేదరిక డేటా'గా కుదిస్తూ, వాటిని సమగ్రంగా అర్థం చేసుకోలేకపోతున్నాయి. భారత రాజ్యాంగ పీఠిక ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందిస్తామని హామీ ఇస్తోంది. ఆ హామీ నిజంగా అర్థవంతం కావాలంటే, ఆదివాసీల కోసం యూనివర్సల్, హక్కుల ఆధారిత సామాజిక రక్షణ వ్యవస్థను నిర్మించాల్సిందే. సంక్షేమం అనేది అనుమానంతో వడపోసే వ్యవస్థగా కాకుండా, ఆదివాసీలను హక్కులు కలిగిన పౌరులుగా గౌరవంతో రక్షించే రాజ్యాంగబద్ధమైన హామీగా మారాల్సిన సమయం ఆసన్నమైంది.



## అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా-కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్యన జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రధాని మోడీ విధానాలే దేశానికి శాపం

ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని.. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పెట్రోల్ కొరత, విపరీతమైన ధరల పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు, దేశ ఆర్థిక పరిస్థితిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వీ.హెచ్ మాట్లాడుతూ.. 'దేశంలో సామాన్యుడు ఎక్కడికి వెళ్లినా పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనం. మోదీ నిర్ణయాల వల్ల ఆయన స్నేహితులు అంబానీ, అదానీ లాభపడుతున్నారు. ప్రధాని మోదీ నిరంతరం జపించే 'సబ్ కా సాత్-సబ్ కా వికాస్' అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది. ఆచరణలో మాత్రం అది 'అందరినీ ఇబ్బంది పెట్టే' విధానంగా మారింది. యుద్ధాన్ని ఆపేందుకు మోదీ ఎందుకు ప్రయత్నం చేయలేదు? మోదీకి ట్రంప్ ఫ్రెండ్ అని అంటారు కదా ట్రంప్‌కి చెప్పి యుద్ధాన్ని ఆపవచ్చు కదా. దేశ ఆర్థిక పరిస్థితి కుంగి పోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో ఎలా గెలవాలో తెలిసిన అమిత్ షాకి ఆర్థిక సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదా?' అని అన్నారు.

## విశాఖ ఉక్కును అమ్మి భూములు కొట్టేయాలనుకున్నారు

విశాఖ ఉక్కును నిర్వీర్యం చేయాలని గత వైసీపీ ప్రభుత్వం చూసిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసి.. ఆ విలువైన భూములను ఆక్రమించుకోవాలని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కుట్ర పన్నారని పేర్కొన్నారు. అధికార దాహంతో ఉక్కు భూములను ఆక్రమించాలని వైఎస్ జగన్ చూశారని మండిపడ్డారు. తన స్వార్థం కోసం వైఎస్ జగన్ ఎవరినైనా బలి చేస్తారన్నారు. సోమవారం శ్రీకాకుళంలో మంత్రి కె. అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నడుం బిగించారని తెలిపారు. ఈ ఉక్కు పరిశ్రమ కోసం కేంద్రాన్ని ఒప్పించి రూ.15 వేల కోట్ల నిధులను సీఎం చంద్రబాబు మంజూరు చేయించారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ఓ బ్రాండ్ అని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు విజన్‌కు ఆకర్షితులైన పారిశ్రామిక దిగ్గజాలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. గూగుల్, రిలయన్స్, మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని చెప్పారు. గత వైసీపీ పాలనలో కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించడమే కాకుండా.. భయభ్రాంతులకు గురి చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వైసీపీని శాశ్వతంగా పాతాళానికి పంపుతామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారు.. రాష్ట్రానికి దండం పెట్టి వెనుదిరిగారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నీకెంత - నాకెంత అన్నట్లుగా పాలన సాగేదని వివరించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి స్థానం లేదని కుండబద్దలు కొట్టారు. అధికారం కోసం సొంత బాబాయినే అడ్డంగా నరికేశారని వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పదవుల కోసం వారు అక్కర్లేదు

పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడి పోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు' అంటూ పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. తాను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా.. అంటూ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో బదులిస్తామని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇకపోతే కుల రాజకీయాలు, ప్రత్యర్థి పార్టీల విమర్శలు, పార్టీ అంతర్గత పరిస్థితులపై జనసేన పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో రాజకీయాలు చాలా సాఫీగా సాగిపోయాయని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అక్కడి రాజకీయాలను చూస్తే అసూయ కలిగేంత సులభంగా జరిగాయని అన్నారు. తాను పదేపదే కులం గురించి మాట్లాడుతున్నానని కొందరు విమర్శిస్తున్నారని పేర్కొన్న పవన్.. తాను ఎప్పుడైనా కుల నాయకుడినని చెప్పానా? మిగతా పార్టీ నేతలు కులం గురించి మాట్లాడటం లేదా? అంటూ ప్రశ్నించారు. కులాలను రెచ్చగొట్టే మనస్తత్వం సమాజానికి మంచిది కాదని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన చర్చలపై కూడా ఆయన స్పందించారు. 'నేను అమిత్ షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదు? వైసీపీ నేత జైలుకెళ్లాలని నేను ఎందుకు కోరుకుంటాను? ఒక నాయకుడు జైలుకెళ్తే జనసేన ఎదుగుతుందా?' అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రితో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనే మాట్లాడతాం.. ఇలాంటి ఆరోపణలు చేయడం వ్యవస్థను అవమానపరచడమేనని పవన్ అన్నారు. తాను అమిత్ షాను కలిసింది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని స్పష్టం చేశారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు. 'మాకు కూడా కోపాలు, బాధలు ఉంటాయి. చూస్తూ ఊరుకుంటామని అనుకోవద్దు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది.. భరిస్తాం.. సహిస్తాం.. అవసరమైతే తాట తీస్తాం' అంటూ పవన్ హెచ్చరించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com